



# విజయభాను

విశాఖపట్నం, మంగళవారం 10-10-2023 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 48 సంచిక : 27 పేజీలు : 08 వెల : 1 రూపాయి




# ప్రజలతోనే పొత్తు

- ప్రజలకు తొలి సేవకుడిగా నేను ఉంటా..
- ఫిబ్రవరిలో మేనిఫెస్టో
- దేశ క్రీడల్లో వై నాట్ ఏపీ అనే పరిస్థితి రావాలి
- నవంబర్ 1 నుంచి డిసెంబర్ 10వరకూ వై ఏపీ నీడ్స్ జగన్ ప్రోగ్రాం
- అక్టోబర్ 25 నుంచి డిసెంబర్ 31 వరకు బస్సుయాత్ర

*" ప్రజలకు తొలి సేవకుడిగా బాధ్యతగా వ్యవహరించాను. అధికారం బాధ్యత ఇచ్చింది. 52 నెలల కాలంలో సువర్ణాక్షరాలతో లిఖించేలా పాలన అందించాం. మూడు ప్రాంతాల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ మూడు రాజధానులు ఏర్పాటు చేశాం. వైఎస్సార్‌సీపీ తప్ప ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకున్న పార్టీ దేశంలోనే లేదు అంటూ స్పష్టం చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి "*

వార్త 2లో





సభా వేదిక ప్రాంగణంలో విశాఖ ఉత్తర నియోజక వర్గం సమన్వయకర్త కె.కె. రాజు




సభా వేదిక ప్రాంగణంలో నరసన్నపేట ఎంపీపీ ఆరింగి మురళీధర్ నేతృత్వంలో



సభ వేదిక వద్ద సీఎం జగన్ తో మంత్రి విడదల రజని, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తదితరులు

## 5 రాష్ట్రాల్లో ఎన్నిక సమరం మొదలు

### - ఎన్నిక తేదీలు



ఢిల్లీ : 5రాష్ట్రాల్లో ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు 5రాష్ట్రాల ఎన్నిక నోటిఫికేషన్ ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ మేరకు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈసీఐ వివరాలను వెల్లడించింది. నవంబర్ 30న తెలంగాణ, నవంబర్ 23న రాజస్థాన్, నవంబర్ 17న మధ్యప్రదేశ్, నవంబర్ 7, 17 తేదీలలో ఛత్తీస్గఢ్ లో రెండు విడతలలో జరగనుండగా, నవంబర్ 17 న మిజోరాంలో ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాలలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినట్లు ఈసీఐ ప్రకటించింది. నవంబర్ 30న ఓటింగ్ ముగియగా డిసెంబరు 3న ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కించి, ఫలితాలను వెల్లడించనున్నారు.

తెలంగాణ(119), మధ్యప్రదేశ్(230), ఛత్తీస్గఢ్(90), రాజస్థాన్(200), మిజోరాం(40) రాష్ట్రాలలో మొత్తం 679 అసెంబ్లీ సీట్లు ఉండగా, మొత్తం 16.14 కోట్లమంది ఓటర్లు ఉన్నారని తెలిపింది.. కొత్తగా 60 లక్షల మంది కొత్త ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. మహిళల ఓటర్ల సంఖ్య పెరిగిందని పేర్కొంది. ఎన్నిక నిర్వహణకు 5 రాష్ట్రాల్లో 40 రోజుల పాటు పర్యటించి అన్ని

తరువాయి 2లో..

## ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధం... పిల్లల్లో ప్రాణాంతక వ్యాధి వ్యాప్తి..!

ఇజ్రాయెల్ : ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధం మధ్య పిల్లలలో మీజిల్స్ విస్తృతంగా వ్యాప్తి చెందుతున్నదని ఇజ్రాయెల్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. గత కొన్నాళ్లుగా రష్యా - ఉక్రెయిన్ యుద్ధం కొనసాగుతోంది. ప్రపంచంలో ఈ యుద్ధం తర్వాత.. ఇప్పుడు ఇజ్రాయెల్-పాలస్తీనాల మధ్య యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ... మరోసారి దేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ దారుణంగా దెబ్బతినే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. వీటి పర్యవసానాలను దేశంలోని సామాన్య ప్రజలు భరించవలసి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

పిల్లలకు ప్రాణాంతక వ్యాధి....

టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్‌లో ప్రచురితమైన ఒక నివేదిక ప్రకారం ... ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ నగరంలో రెండేళ్ల వయసున్న నలుగురు పిల్లలు తీవ్రమైన తట్టు (మీజిల్స్)

తరువాయి 2లో..

## చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా..



దిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని తెదేపా అధినేత చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ మంగళవారానికి వాయిదా పడింది. జస్టిస్ అనిరుద్ధబోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు హరీష్‌సాల్వే, అభిషేక్ మను సింఘ్వీ, సిద్ధార్థ లూథ్రా సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. 17ఏ లోని నిబంధనలను ఒక్కొక్కటిగా బెంచ్ ముందు హరీశ్ సాల్వే పెట్టారు. దీంతో మీ క్లయింట్ కేసులో 17ఏ వర్తించే అవకాశాలు ఉన్నాయని జస్టిస్ అనిరుద్ధబోస్ పేర్కొన్నారు. "అవును.. బెంచ్ పరిశీలన వాస్తవమే. ఈ కేసులో అందరికీ బెయిల్ వచ్చింది. అసలు అరెస్ట్ అనేదే చట్టవిరుద్ధం" అని సాల్వే బదులు ఇచ్చారు. ఇదంతా చూస్తే 10 శాతం నిధులు ప్రభుత్వం ముందుగా ఇచ్చి 90 శాతం సీమెన్స్ తర్వాత పెట్టడం మూలానా వచ్చినట్లుందని జస్టిస్ త్రివేది అభిప్రాయపడ్డారు. అయితే, మంగళవారం ఉదయం 10.30 గంటలకు తిరిగి

తరువాయి 2లో..

## ల్యాండ్.. శాండ్.. వైన్.. మైన్ మాఫియాలకే జగన్ కావాలి..

## పేదలకు కాదు



అమరావతి: పేదలను విస్మరించిన జగన్‌కి.. రాష్ట్ర ప్రజలకు మధ్య యుద్ధం జరుగుతోందని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విమర్శించారు. అబద్ధాలు ఆడటం సీఎం జగన్‌కు బాగా అలవాటు అయిందన్నారు. రాష్ట్రంలోని పేదల పట్ల సీఎం జగన్ కపట ప్రేమ చూపిస్తున్నారన్నారు. జగన్‌కు పేదలపై ఉన్న ప్రేమ నిజమైతే.. వారి కోసం తెదేపా తీసుకొచ్చిన 120 పథకాలను ఎందుకు

తరువాయి 2లో..

## పోలీస్ స్పందనలో ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించండి

### - పోలీస్ స్పందనలో నేరుగా ఫిర్యాదుల స్వీకరించిన సీపీ డాక్టర్ ఏ రవిశంకర్



విశాఖపట్నం క్రైమ్ (విజయభాను న్యూస్) : నగర పోలీస్ కమిషనర్ డాక్టర్.ఏ.రవి శంకర్ (ఐ.పీ.ఎస్) ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమం నగర పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించినారు. ఈ స్పందన కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ రవి శంకర్ (ఐపీఎస్), డి.సి.పి(క్రైమ్స్) జి.నాగన్న, ఏ.డి.సి.పి(ఎడ్మిన్) ఎం.ఆర్.కే రాజు మరియు లీగల్ అడ్వైజర్ పి.వి రామకృష్ణ తో కలిసి నగర పోలీసు అధికారులు మరియు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ లు, ఎస్సైలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్పందన కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ స్పందన కార్యక్రమానికి 55 మంది ఫిర్యాదుదారులు వచ్చి తమ తమ సమస్యలను రిపోర్టులు ద్వారా అందజేసినారు.సి.పి ఫిర్యాదులను పరిశీలించి వారితో మాట్లాడి, వారి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో

తరువాయి 2లో..




# ప్రజలతోనే పొత్తు



విజయవాడ, (విజయభాను న్యూస్) : ప్రజలకు తొలి సేవకుడిగా బాధ్యతగా వ్యవహరించాను. అధికారం బాధ్యత ఇచ్చింది. 52 నెలల కాలంలో సువర్ణాక్షరాలతో లిఖించేలా పాలన అందించాం. మూడు ప్రాంతాల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ మూడు రాజధానులు ఏర్పాటు చేశాం. వైఎస్సార్‌సీపీ తప్ప ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకున్న పార్టీ దేశంలోనే లేదు అంటూ స్పష్టం చేశారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి.

వైఎస్ జగన్ అంటే మాట నిలబెట్టుకునే వ్యక్తి..

విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో భాగంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా నా కుటుంబ సభ్యులే. నాలుగేళ్ల పాలనలో వ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చాం. గ్రామస్థాయిలోనే సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చాం. ప్రతి 50 ఇళ్లకు ఒకరు ఉండేలా వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చాం. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 99 శాతం హామీలను నెరవేర్చాం. వైఎస్ జగన్ అంటే మాట నిలబెట్టుకుంటాడని నిరూపించుకున్నాం. వ్యవస్థలోగానీ, పాలనలోగానీ ఇన్ని మార్పులు తెచ్చిన పార్టీ లేదన్నారు. 'ఫిబ్రవరిలో వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోతో ప్రజల వద్దకు వెళదాం. మార్చిలో ఎన్నికలకు సన్నద్ధమవుదాం. వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా గ్రామస్థాయి నుంచే మమేకమవ్వాలి. నేతలు, కార్యకర్తలు కలిసికట్టుగా అడుగులు వేయాలి.' 'రాబోయేది కురుక్షేత్ర యుద్ధం. పేదవాడికి, పెత్తందార్లకు మధ్య యుద్ధం. పేదవాడి పార్టీ వైఎస్సార్‌సీపీ. రాబోయే రోజుల్లో జరిగేది క్లాస్ వార్. పేదవాడు ఒక వైపు.. పెత్తందారు మరోవైపు. పేదవాళ్లు మొత్తం ఏకం కావాలి. అప్పుడే పెత్తందార్లను ఎదుర్కోగలం.' 'ఎన్నికల సంగ్రామంలో పొత్తు ప్రజలతోనే. మీ బిడ్డ పొత్తులపై ఆధారపడడు. దేవుడిని, ప్రజలనే నమ్ముకున్నాను. సంక్షేమ పథకాలను ఇంటింటికి అందించిన ప్రభుత్వం మనది. రాష్ట్రంలోని 87 శాతం కుటుంబాలకు సంక్షేమాన్ని అందించాం. ఎక్కడా లంచాలకు తావు లేదు. వివక్షకు చోటు లేదు. మనం అమలు చేసిన ప్రతీ కార్యక్రమం ఒక విప్లవం. ధైర్యంగా ప్రతీ ఇంటికి వెళ్లి అడగడం ఒక చరిత్ర. ఎన్నికల తర్వాత కూడా ఎప్పుడూ ఎమ్మెల్యేలు ప్రజల మధ్యలోనే ఉన్నారు'

వై ఏపీ నీడ్స్ జగన్

ప్రజలకు మరింత మంచి చేయడానికి మళ్లీ జగన్ రావాలి. నవంబర్ 1 నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని చేపడతాం. ఈ కార్యక్రమం డిసెంబర్ 10 వరకు కొనసాగుతుంది. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం గ్రామస్థాయిలోకి తీసుకెళ్లాలి. మండల స్థాయి నేతలు సచివాలయాలను సందర్శించాలి. రాష్ట్రంలో జరిగిన మంచి గురించి ప్రజలకు చెప్పాలి. 2019లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న విషయాన్ని చెప్పాలి. రాష్ట్రానికి, ప్రతి ఇంటికి జరిగిన మంచిని తెలపాలి. టీడీపీ, దత్తపుత్రుడి మోసాలను ప్రజలకు వివరించాలి.

బస్సు యాత్ర..

అక్టోబర్ 25 నుంచి డిసెంబర్ 31 వరకు బస్సుయాత్ర. మూడు ప్రాంతాల్లో బస్సు యాత్ర ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర ఉంటుంది. ఎమ్మెల్యేలు, సీనియర్ల ఆధ్వర్యంలో బస్సు యాత్ర. ఈ బస్సు యాత్ర బృందంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలుంటారు. ప్రతీరోజు మూడు మీటింగ్‌లు జరుగుతాయి. ప్రభుత్వం చేసిన మంచి, సామాజిక న్యాయం, సాధికారత గురించి తెలియజేయాలి. ఇది బస్సు యాత్ర మాత్రమే కాదు. సామాజిక న్యాయ యాత్ర. పేదవారికి జరిగిన మంచిని వివరించే యాత్ర. బస్సు యాత్రలో పార్టీ శ్రేణులు పాల్గొనాలి. రాష్ట్రంలో జరిగిన మంచి గురించి ప్రజలకు చెప్పాలి. 2019లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్న విషయాన్ని చెప్పాలి. రాష్ట్రానికి, ప్రతి ఇంటికి జరిగిన మంచిని తెలపాలి. టీడీపీ, దత్తపుత్రుడి మోసాలను ప్రజలకు వివరించాలి.

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం..

డిసెంబర్ 11 నుంచి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం. జనవరి 15 వరకు ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబురం జరుగుతుంది. గ్రామస్థాయిలో నైపుణ్యం ఉన్న క్రీడాకారులను గుర్తిస్తాం. భారత్‌లో వై నాట్ ఏపీ పరిస్థితి రావాలి. ప్రభుత్వం నిర్వహించే క్రీడా సంబురం ఇది. విజేతలు రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారు.

పెన్షన్ పెంపు..

జనవరి 1వ తేదీ నుంచి పెన్షన్ పెంపు కార్యక్రమం ఉంటుంది. ఇచ్చిన మాట ప్రకారం రూ.3000 పెన్షన్ పెంపు అందిస్తాం. అవ్వాతాతలు, వితంతువులకు రూ.3వేల పెన్షన్. ఇచ్చిన మాట ప్రకారం రూ.3వేల పెన్షన్ అందిస్తాం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాక ముందు 39 లక్షల మందికి పెన్షన్లు. మేము అధికారంలోకి వచ్చాక 66లక్షల మందికి పెన్షన్లు ఇచ్చాం. నెలకు రూ.2వేల కోట్ల భారం చిరునవ్వుతో భరిస్తున్నాం. జనవరి 10 నుంచి జనవరి 20 వరకు వైఎస్సార్ చేయూత అందిస్తాం. రూ. 19వేల కోట్లు చేయూత ద్వారా అందిస్తున్నాం. జనవరి 20 నుంచి 30 వరకు వైఎస్సార్ ఆసరా. ఇప్పటికే మూడు దఫాలుగా వైఎస్సార్ ఆసరా ఇచ్చాం. వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.26వేల కోట్ల రూపాయలు ఇస్తున్నాం. ఇప్పటికే మూడు దఫాలుగా ఆసరా ఇచ్చాం. పొదుపు సంఘాలకు మొత్తంగా రూ.31వేల కోట్లు అందిస్తున్నాం.

పేదవాడి గురించి ఆలోచించే ప్రభుత్వం మనది..

సామాజిక వర్గాలకు, ప్రాంతాలకు సమ న్యాయం చేశాం. రూ.2లక్షల 35వేల కోట్లు నేరుగా డీబీటీ ద్వారా నేరుగా అందించాం.

31 లక్షల ఇళ్ల పట్టాలు అక్కచెల్లెమ్మలకు ఇచ్చాం. 22లక్షల ఇళ్లు అక్కచెల్లెమ్మల పేరుతో నిర్మాణం జరుగుతున్నాయి. ఇందులో 80 శాతం పైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చాం. నామినేటెడ్ పదవుల్లో 50 శాతానికి పైగా వీరికే ఇచ్చాం. ఈ నాలుగేళ్లలో 2.7లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. అక్కచెల్లెమ్మల సాధికారతకు కృషి చేశాం. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. పేదరికంలో ఉన్నవారు ఉన్నత స్థానానికి వ?చ్చేలా చర్యలు తీసుకున్నాం. పేదవాడి గురించి ఆలోచించే ప్రభుత్వం మనది. కేబినెట్‌లోనూ సామాజిక న్యాయం పాటించాం. అవినీతికి తావు లేకుండా పాలన అందించాం.

జగనన్న సురక్ష..

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలి. రాష్ట్రంలో ఏ ఒక్క కుటుంబం కూడా వ్యాధుల బారిన పడకూడదు. వ్యాధి సోకిన వారికి తగిన చికిత్స ఇచ్చేందుకు సురక్ష పథకం తెచ్చాం. 15వేల హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నాం.

సురక్ష ద్వారా కోటి 65 లక్షల ఇళ్లను కవర్ చేస్తున్నాం. వ్యాధి బారినపడిన వారిని గుర్తించి చికిత్స అందిస్తున్నాం. వ్యాధి నయం అయ్యే వరకు పూర్తి ఉచితంగా చికిత్స అందిస్తాం. ఆరోగ్య

సురక్ష ద్వారా 1.65 కోట్ల ఇళ్లను కవర్ చేస్తున్నాం. జగనన్న ఆరోగ్య సురక్ష నిరంతర ప్రక్రియ. విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అనుసంధానం.

## ల్యాండ్.. శాండ్.. వైన్.. మైన్ మాఫియాలకే జగన్ కావాలి.. పేదలకు కాదు

రద్దు చేశారని నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సబ్ ప్లాన్ నిధులు రూ.1.14 లక్షల కోట్లను ఎందుకు మళ్లించారంటూ ప్రశ్నించారు. ఈ మేరకు మీడియాతో మాట్లాడిన అచ్చెన్న.. రాష్ట్ర ప్రజల పట్ల జగన్ తీరుపై విమర్శలు గుప్పించారు.

"నాసిరకమైన మద్యంతో 20వేల మంది పేదల ప్రాణాలు తీశారు. అన్న క్యాంటీన్లను రద్దు చేసి పేదల పొట్టకొట్టారు. పెళ్లి కానుకలు, సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ కానుకలు రద్దు చేశారు. 2018-19లో సంక్షేమానికి తెదేపా 18.21 శాతం ఖర్చు చేస్తే.. 2022-23లో జగన్ సర్కారు 16.20 శాతం మాత్రమే ఖర్చు చేశారు. తెదేపా సంక్షేమం పేదలను సొంత కాళ్లపై నిలబెడితే.. జగన్ రెడ్డి పేదలను బిచ్చగాళ్లని చేశారు. ఇకపై జగన్ రెడ్డిని భరించలేమని రాష్ట్ర ప్రజలు అంటున్నారు. ల్యాండ్.. శాండ్.. వైన్.. మైన్ మాఫియాలకే జగన్ రెడ్డి కావాలి.. పేదలకు కాదు. జగన్ రెడ్డిని మించిన పెత్తందారు మరొకరు లేరు" అని అచ్చెన్నాయుడు విమర్శించారు.

## ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధం... పిల్లల్లో ప్రాణాంతక వ్యాధి వ్యాప్తి..!

వ్యాధి బారినపడ్డారు. చిన్నపిల్లలకు వస్తున్న ఈ ప్రాణాంతక వ్యాధి విషయంలో నివారణ చర్యలు చేపట్టాలని, పిల్లలకు టీకాలు వేయాల్సిన అవసరం ఉందని ఇజ్రాయెల్ పీడియాట్రిక్ అసోసియేషన్ ప్రభుత్వానికి తెలిపింది. దేశంలోని తల్లిదండ్రులు తమ పిల్లలకు వెంటనే టీకాలు వేయించాలని వైద్యాధికారులు సూచనలు చేశారు. తట్టు అనేది వాస్తవానికి రుబియోలా అనే వైరస్ వల్ల కలిగే ఇన్ఫెక్షన్. ఇది ఎక్కువగా పిల్లలపై దాడి చేస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ చాలా వేగంగా ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది. ఇది పిల్లలకు ప్రాణాంతకంగా పరిణమిస్తుంది. ఈ వైరస్ సోకాక 10 నుండి 14 రోజుల వ్యవధిలో ఈ ఇన్ఫెక్షన్ లక్షణాలు బయపటతాయి.

గాలిలో వైరస్ వ్యాప్తి...

వాస్తవానికి మీజిల్స్ (తట్టు) లక్షణాలు సాధారణంగా రోగి ముక్కు, గొంతులో కనిపిస్తాయి. బాధితుడు దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు

ఈ వైరస్ గాలిలో కలుస్తుంది. ఫలితంగా వ్యాధి ఇతరులకు వ్యాప్తి చెందుతుంది. ఈ ప్రమాదకరమైన వ్యాధికి టీకా అందుబాటులో ఉంది. రెండు మోతాదుల టీకా ఈ వ్యాధిని నివారించడంలో, ప్రాణాలను రక్షించడంలో 97 శాతం ప్రభావవంతంగా ఉంటుందని స్పష్టమయ్యింది.

## గరే గురునాథ్ ఆధ్వర్యంలో కాగడాల ర్యాలీ




మధురవాడ (విజయభాను న్యూస్) : టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడి అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ నేను సైతం - బాబు కోసం పేరిట తెలుగు యువత ఉపాధ్యక్షులు గరె గురునాథ్ ఆధ్వర్యంలో ఆదివారం పిఎం పాలెం చివరి బస్ స్టాప్ వద్ద నుంచి కార్ షేడ్ కూడలి వరకు పెద్ద ఎత్తున కాగడాల ప్రదర్శన తో ర్యాలీ గా నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భీమిలీ నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కోరాడ రాజబాబు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ప్రతి రోజు రాష్ట్రం వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు పి.ఎస్ నాయుడు, రాష్ట్ర బి సి సెల్ ఉపాధ్యక్షుడు గొల్లంగి ఆనంద్ బాబు, వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, జనసేన నాయకులు ఇ.ఎన్.ఎస్ చంద్ర రావు, సంతోష్ నాయుడు, బి.వి కృష్ణయ్య, టీడీపీ వార్డు బి.సి సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారయణ, కనక రాజు మాస్టర్, సెక్రెటరీ పోలిశెట్టి నాగేశ్వర రావు, పోతిన రఘు, అబ్దుల్ బాషా, కె రామకృష్ణ, బాబ్జీ, పోతిన నాయుడు టిడిపి, జనసేన కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## బర్నికంలో దుర్గాదేవి రాటోత్సవం



పరవాడ:- పరవాడ మండలం భరణికం పంచాయతీలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో దుర్గాదేవి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు.. దీంట్లో భాగంగా సోమవారం గ్రామ పెద్దలు బర్ణికం మాజీ సర్పంచ్ బోండా తాతారావు, గ్రామ పెద్దలు దాట్ల గణేష్ రాజు హాజరై అతిథులు చేతుల మీదుగా రాటోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా దుర్గాదేవి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ పెద్దలు పేర్కొన్నారు... ఈ కార్యక్రమంలో పి. శ్రీనివాసరావు, బొండా నాని, వరలక్ష్మిగ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు..

### చంద్రబాబు అరెస్టు దుర్మార్గం.. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

పరవాడ:-బాబుతో నేను కార్యక్రమంలో పెందుర్తి క్లస్టర్ 10 ఇంచార్జ్ మరియు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ వినాయక నగర్ లో ఇంటింటికి తిరిగి ప్రజలందరినీ చైతన్యపరచడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు నెల రోజుల నుంచి బాబు గారిని జైల్లో ఉంచి ఈ సైకో జగన్మోహన్ రెడ్డి సునకానందం పొందుతున్నారని ఆయన అన్నారు. చంద్రబాబు అరెస్ట్ దుర్మార్గమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో ఏరియా ఇంచార్జ్ అర్జున్, బూత్ కన్వీనర్ తురసాల శ్రీనివాసరావు తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై విచారణ వాయిదా..

వాదనలు వినిపించేందుకు అనుమతి ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం తరఫున ముకుల్ రోహత్గీ కోరారు. దీంతో రోహత్గీ అభ్యర్థనకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

వాదనలు జరిగాయి ఇలా..

చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై ఈ నెల 3నే ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు.. హైకోర్టు ముందు దాఖలు చేసిన పత్రాలను తమకు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను నేటికి వాయిదా వేసింది. దీంతో సోమవారం మళ్లీ వాదనలు కొనసాగాయి. 2018లోనే విచారణ ప్రారంభమైందంటూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముకుల్ రోహత్గీ చేసిన వాదనలను ఈ సందర్భంగా జస్టిస్ బేలా ఎం.త్రివేది ప్రస్తావించారు. అనంతరం హరీశ్ సాల్వే వాదిస్తూ రోహత్గీ వాదనే సహేతుకం కాదని.. ఎఫ్ఐఆర్‌కు దారితీసిన విచారణ అదికాదని చెప్పారు. గతంలో ఏదో విచారణ జరిగిందని.. దాన్ని మూసేశారని చెప్పారు. ఆ తర్వాత కొత్త విచారణ ప్రారంభించారని తెలిపారు. 'దానికి సంబంధించిన డాక్యుమెంట్లు ఎక్కడున్నాయి? హైకోర్టు వాటిని పరిశీలించిందా' అని జస్టిస్ బేలా ఎం.త్రివేది ప్రశ్నించగా.. అసలు సమస్యంతా అక్కడే ప్రారంభమైందని సాల్వే చెప్పారు.

"మంచి, చెడు అనేది పక్కన పెడితే హైకోర్టు డేట్ ఆఫ్ అఫెన్స్‌ను పరిగణనలోకి తీసుకుంది. డేట్ ఆఫ్ ఎఫ్ఐఆర్ పరిగణనలోకి తీసుకోవాలని మా వాదన. గౌరవనీయమైన కోర్టు దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. 17ఏ అనేది డేట్ ఆఫ్ ఎఫ్ఐఆర్ వర్తిస్తుందా?లేదా? డేట్ ఆఫ్ అఫెన్స్ కింద వర్తిస్తుందా? అనేది కోర్టు ముందుంచా. నేరుగా నగదు తీసుకుంటూ పట్టుబడితే తప్ప మిగిలిన అన్నింటికి 17ఏ వర్తిస్తుంది. అవినీతి నిరోధక శాఖ చట్టం ప్రకారం కేసు పెడితే ఈ పాటికే మాకు ఉపశమనం లభించేది" అని సాల్వే వాదించారు.

2018లో ఎఫ్ఐఆర్ లేదు.. విచారణే లేదు

అయితే, విచారణ ఎప్పుడు ప్రారంభమైందని జస్టిస్ అనిరుద్ధబోస్ ప్రశ్నించగా.. ఆ ఫిర్యాదుతో పిటిషనర్‌కు సంబంధమే లేదని సాల్వే వెల్లడించారు. "డిజైన్ టెక్, స్కిల్ టెక్ మధ్య జీఎస్టీకి సంబంధించిన ఫిర్యాదు ఇది. డిజైన్ టెక్, సీమెన్స్ సొమ్ము తరలించారన్న ఆరోపణలకు సంబంధించింది" అని తెలిపారు. మరోవైపు, ఒప్పందం ఎవరితో జరిగిందని జస్టిస్ బేలా ఎం.త్రివేది ప్రశ్నించగా.. రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం జరిగిందని సాల్వే సమాధానమిచ్చారు. "అన్నీ పరిణామాలను పరిశీలిస్తే.. కేసు నమోదు, ఫిర్యాదు విచారణ అన్నీ కూడా 2021లోనే జరిగాయి. జూన్ 2018లో ఎఫ్ఐఆర్ లేదు.. విచారణే లేదు. 2021 సెప్టెంబర్ 7న ఫిర్యాదు ఆధారంగా ప్రాథమిక విచారణ ప్రారంభమైంది. 2018 జులైకు ముందు జరిగిన నేరాలకు 17ఏ వర్తించదని రాష్ట్ర ప్రభుత్వం వాదనగా ఉంది.

ఆరోపణలన్నీ 2015, 2016కు సంబంధించినవి కాబట్టి ఇప్పటి విచారణలో పరిగణనలోకి తీసుకోలేమని హైకోర్టు భావించింది. వీటన్నింటినీ మేము కోర్టు ముందు ఉంచుతున్నాం. ఫిర్యాదు, విచారణ అన్నీ 2021లో ఉన్నాయి. కాబట్టి 17ఏ వర్తిస్తుందని కోర్టుకు విన్నవిస్తున్నాం. కేసులో ఎప్పుడు ఏం జరిగింది.. వివరాలేంటి? అనే దానిపై ఇప్పుడు మేము ప్రస్తావించట్లేదు. కేసులో ఉన్న వాస్తవాలపై రాష్ట్ర ప్రభుత్వం మసిపూసే ప్రయత్నం చేసింది. రిమాండ్ ఆర్డర్ స్పష్టంగా 2021లో జరిగిన ప్రాథమిక విచారణ ఆధారంగానే కేసు నమోదు చేసినట్లు ఉంది. 2015 - 16లో చంద్రబాబు నిధులు విడుదల చేసినట్లు చెబుతున్నారు. నిధుల విడుదల అనేది కేబినెట్ నిర్ణయం వ్యక్తులకు వర్తింపచేయలేము.

"17ఏకు ఉన్న అన్వయాన్ని మాత్రమే బెంచ్ ముందు ఉంచదలుచుకున్నా. రాజకీయ ప్రతీకార చర్యలు లేకుండా ఉండడం కోసమే 17ఏ తీసుకొచ్చారు. గత ప్రభుత్వాలపై వేధింపులు లేకుండా ఉండేందుకే చట్టసవరణ జరిగి 17ఏ అమలులోకి వచ్చింది. 17ఏ అమలుపై కేంద్ర ప్రభుత్వం స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్‌ను రాష్ట్రాలకు జారీ చేసింది. పబ్లిక్ సర్వెంట్లపై ఆరోపణలు చేయాలంటే తప్పనిసరిగా అధీకృత అధికారి నుంచి సమ్మతి అవసరం. ఉద్యోగులనైనా, ప్రజాప్రతినిధులైనా ఎలాంటి పద్ధతి ఫాలో కావాలన్న దానిపై ఎస్‌వోసీలో పేర్కొన్నారు. ప్రతీకార చర్యలకు పాల్పడిన సందర్భాలు ఉన్నందునే చట్టానికి సవరణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 17ఏ ప్రకారం ప్రజాప్రతినిధులపై ఏ తరహా విచారణ చేయాలన్నా పోలీసులు అనుమతులు పొందాల్సిందే" అని హరీశ్ సాల్వే బలంగా వాదించారు.

అయితే, "17ఏ అన్నది అవినీతిని నిరోధించడంలో భాగంగా వచ్చింది. అవినీతిని నిరోధించడంలో నష్టం జరగకూడదన్న బాధ్యత కూడా ఉంది కదా" అని జస్టిస్ త్రివేది ప్రశ్నించారు. "మీరన్నది నిజమే.. కేసు నమోదు, విచారణ అధీకృత అధికారి నుంచి అనుమతి తీసుకున్నాక విచారణ చేయడంలో ఎవరికీ అభ్యంతరం లేదు. అవినీతి నిరోధక చట్టాన్ని దృఢతరం చేస్తూనే ప్రజాప్రతినిధులు స్వతంత్రంగా పనిచేసే అవకాశాన్ని 17ఏ కల్పించింది" అని సాల్వే వెల్లడించారు. దీంతో వాదనలు విన్న న్యాయస్థానం, ప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గీ అభ్యర్థనను దృష్టిలో ఉంచుకుని విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

## 5 రాష్ట్రాల్లో ఎన్నిక సమరం మొదలు

రాజకీయ పార్టీలతో చర్చించామని తెలిపింది.

తెలంగాణ నోటిఫికేషన్ తేదీ: నవంబరు 3

నామినేషన్ల సమర్పణకు చివరి తేదీ: నవంబరు 10

నామినేషన్ల పరిశీలన తేదీ: నవంబరు 13

నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ: నవంబరు 15

పోలింగ్ తేదీ: నవంబరు 30

రాజస్థాన్ పోలింగ్ తేదీ : నవంబర్ 23

మధ్యప్రదేశ్ పోలింగ్ తేదీ : నవంబర్ 17

ఛత్తీస్గఢ్ పోలింగ్ తేదీ : నవంబర్ 7, 17(రెండు విడతలు)

మిజోరాం పోలింగ్ తేదీ : నవంబర్ 7


ఐదు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు తేదీ : డిసెంబరు 3

## పోలీస్ స్పందనలో ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించండి

తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి, చట్టపరంగా తగిన చర్యలు తీసుకొని ఫిర్యాదిదారుల సమస్యలను పరిష్కరించవలసినదిగా ఆదేశాలు ఇవ్వడమైనది. ఈ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుదారులు ఇచ్చిన ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, భూ వివాదాలు, భార్య భర్తల గొడవలు, మోసానికి సంబంధించినవి మరియు సివిల్ కేసుల విషయం సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి.

# సాగునీటి ప్రాజెక్టుల సాధనకు బీజేపీ కృషి

- 2009 లో మంజూరు అయిన బాబు బాబు జగజ్జీవన్ రావు సుజల ప్రవంతి పురోగతి లేదు
- పోలవరం పూర్తి చేస్తానని పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీ నెరవేర్చలేదు
- ఉత్తరాంధ్ర వెనుకబటుతనంతో రాజకీయ పార్టీలు ఆడుకుంటున్నాయి
- కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ స్టిక్కర్ల వేసుకుంటున్నారు
- రాష్ట్ర అభివృద్ధికి బీజేపీకి ఒక ఛాన్స్ ఇవ్వండి
- బీజేపీ మీడియా ప్యానలిస్ట్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లే శ్రీరామ మూర్తి




విశాఖపట్నం(విజయభాను న్యూస్): ఉత్తరాంధ్రలో సాగు నీటి ప్రాజెక్టుల సాధనకు కృషి చేస్తానని బీజేపీ మీడియా ప్యానలిస్ట్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లే శ్రీరామ మూర్తి పేర్కొన్నారు. ఆయన లా సన్స్ బే కాలనీ లో గల బీజేపీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ద్వారానే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతున్నాయి అన్నారు. తాను నలబై ఏళు రెవెన్యూ శాఖలో పని చేశానని గుర్తు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా వ్యవహరి స్తున్నానన్నారు.

వి ఆర్ ఓ, పంచాయతీ కార్యదర్శి సంఘాల అధ్యక్షునిగా పని చేశానన్నారు. హుందా రాజకీయాలకు బీజేపీ కట్టుబడి ఉందని అన్నారు. ఉత్తరాంధ్రలో వ్యవసాయం రంగానికి ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వలేదు. అలాగే, బాబు జగజ్జీవన్ రావు సృజల స్రవంతి పథకంలో భాగంగా సుమారు 7214 కోట్ల రూపాయల అంచనాలతో 8 లక్షల ఎకరాలకు (ఉమ్మడి విశాఖపట్నం జిల్లాకు 3.21 లక్షల ఎకరాలు, విజయనగరంలో 3.94 లక్షలు ఎకరాలకు, శ్రీకాకుళం జిల్లాలో 8 ఎకరాలకు) సాగునీరు, 1200 గ్రామాలకు త్రాగునీరు అందించడమే లక్ష్యంగా ఆనాటి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం 2009లో పరిపాలన ఆమోదం ఇచ్చిందని గడచిన 13 సంవత్సరాలుగా ఆ సృజల స్రవంతి పథకం అతి గతి లేకుండా పోయిందని శ్రీరామ్ మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం పూర్తి చేస్తానని జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చినా నెరవేరలేదని ఎద్దేవా చేశారు. పోలవరం ప్రాజెక్టు కి 1942 లో ప్రతిపాదనలు జరగ్గా, 80 ఏళ్లుగా పెండింగ్ లోనే వుందని, ఇప్పటికీ 80 శాతం కూడా పూర్తి కాలేదని మండి పడ్డారు. రూ.17 వేల కోట్ల అంచనా తో మొదలు కాగా, ప్రాజెక్టు డిజైన్లు మార్చి నిర్మాణ వ్యయం రూ.55 వేల కోట్లకు పెంచారన్నారు. పోలవరం కేంద్ర ప్రాజెక్ట్ ను రాష్ట్రమే కడతాం అనడంలో మర్మం ఏమిటి అని ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర వెనుక బాటుతనంతో రాజకీయ పార్టీలు ఆడుకుంటున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి వచ్చే ఎన్నికల్లో బీజేపీ కి ఒక అవకాశం ఇవ్వాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ స్టికర్లు వేసుకుంటున్నారని విమర్శించారు.

బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర మాట్లాడుతూ, 22 ఏ అధికార పార్టీ నేతలే ప్రయోజనం పొందుతు న్నారని విమర్శించారు.వుడా లే అవుట్లు కూడా 22 ఏ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

బీజేపీ విశాఖ జిల్లా ఇంఛార్జి పుట్ట రంగయ్య మాట్లాడుతూ శ్రీ రామ మూర్తి రెవెన్యూ శాఖలో పలు పదవులు నిర్వహించారని గుర్తు చేశారు. ఆయనకు పార్టీలో మీడియా ప్యానలిస్ట్ పదవి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి దానేష్ పాల్గొన్నారు.

# "జగనన్న కు చెబుదాం"కు 106 వినతులు



విశాఖపట్నం(విజయభాను న్యూస్): "జగనన్నకు చెబుదాం" కార్యక్రమములో 106 అర్జీలు స్వీకరించడమైనదని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయి కాంత్ వర్మ పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో "జగనన్నకు చెబుదాం(స్పందన)" కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ "జగనన్న కు చెబుదాం" లో మొత్తం 106 ఫిర్యాదులు వచ్చాయని, వాటిలో ఒకటవ జోన్ కు 1, రెండవ జోన్ కు 18, మూడువ జోన్ కు 19, నాల్గవ జోన్ కు 6, ఐదవ జోన్ కు 16, ఆరువ జోనుకు 19, ఎడవ జోన్ కు 5, ఎనిమిదివ జోన్ కు 7, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 15 ఫిర్యాదులు, మొత్తం 106 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వీటిలో పరిపాలన %ఎ% అక్కౌంట్స్ కు 3, రెవెన్యూ కు 16, పబ్లిక్ హెల్త్ కు 6, టౌన్ ప్లానింగ్ కు 51, ఇంజినీరింగ్ కు 22, డిడిహెచ్ కు 4, యుసిడి కు 4 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిశీలించి ఆ ఫిర్యాదులను 03 రోజులలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రతి సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జరుగుతున్న "జగనన్న కు చెబుదాం" కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరిస్తున్న వినతులు, సలహాల అంశాలపై ఆయా విభాగాధిపతులు చేపట్టిన చర్యలకు సంబంధించి వివరాలతో కూడిన సమాచారంతో..., తరువాత వారం వచ్చే "జగనన్న కు చెబుదాం" కార్యక్రమానికి ముందుగా సమర్పించవలసిన వివరాలుతో ఆయా విభాగాధిపతులు సిద్ధం చేయాలని కమిషనర్ తెలిపారు. ఆయా వివరాలను తరువాత వారంలో సమర్పించడం వలన నిర్ణీత సమయంలో ఎన్ని సమస్యలు పరిష్కారం అవుతున్నదీ, లేనిదీ తెలుసుకోవడానికి వీలుగా ఉంటుందని ఆయన అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై శ్రీనివాస రావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణ రాజు, సిసిపి సునీత, సిఎంఓహెచ్ డాక్టర్ నరేష్ కుమార్, డిసిపి నరేంద్ర రెడ్డి, కార్యదర్శి పి నల్లనయ్య, డిడి(హార్టికల్చర్) దామోదర రావు, ఎఫ్.ఎ & ఎ.ఓ మల్లికాంబ, డిపిఓ చంద్రిక, పిఓ(యుసిడి) సూర్య కళ, పర్యవేక్షక ఇంజినీర్లు సత్యనారాయణ రాజు, వినయ్ కుమార్, కృష్ణారావు, రామ్మోహన్ రావు, శ్యాంసన్ రాజు, కెవిఎన్ రవి, డిఇఓ శ్రీనివాస రావు, డిసిపిలు, ఎసిపిలు, యుసిడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సౌర విద్యుత్ తో అన్ని విధాలా ప్రయోజనకరం

## - కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖ మాజీ ప్రధాన కార్యదర్శి ఈ ఏ ఎస్ శర్మ



విశాఖపట్నం : సోలార్ విద్యుత్తు వాడకం వలన కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని కేంద్ర ప్రభుత్వ ఇంధన శాఖ మాజీ ప్రధాన కార్యదర్శి ఈ ఏ ఎస్ శర్మ అభిప్రాయపడ్డారు. సోమవారం నగరంలోని పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో డీ- కేంద్రీకృత సోలార్ పవర్ సిస్టం (స్థిరమైన గ్రామాల సాధికారత) అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్ చాలా చౌకని, కాలుష్య రహితమని తెలిపారు. సోలార్ సిస్టంను కార్పొరేట్ కంపెనీలకు కాకుండా, స్వతంత్రంగా గృహాలకు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. సోలార్ సిస్టం

వాడకాలను ప్రారంభిస్తే కరెంట్ అవసరం ఉండదన్నారు. పైగా సోలార్ అభివృద్ధి చేస్తే ఆర్థిక అవసరాలు మెరుగుపడతాయని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధిక భాగం విద్యుత్తును థర్మల్ పవర్ స్టేషన్ల ద్వారా ఉత్పత్తి చేసుకుంటున్నామని గుర్తు చేశారు. థర్మల్ పవర్ ద్వారా ఒక మెగా వాట్ సామర్థ్యానికి రూ. 8 నుండి 10 కోట్లు పెట్టుబడి అవుతుందన్నారు. అలాగే బొగ్గు నాణ్యత తక్కువగా ఉండడంతో ఇతర దేశాల నుండి బొగ్గుని దిగుమతి చేసుకోవడం జరుగుతోందని , పవర్ స్టేషన్ల ద్వారా పర్యావరణానికి హాని కలుగుతోందన్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం వెచ్చించే నిధుల నుండి రెన్యువల్ ఎనర్జీ ప్లాంట్లను గ్రామీణ స్థాయిలో నెలకొల్పేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికలు తయారు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో అనకాపల్లి మానవ హక్కుల సంఘం నేత కాంబ్రేకుల వెంకటరమణ, కిసాన్ సర్వీస్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు అక్కినేని భవాని ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# కైలాసగిరి కొండ తవ్వకాలను, మైనింగ్ ను నిలిపివేయాలి

## - స్పందనలో జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేసిన జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్



విశాఖపట్నం(విజయభాను న్యూస్): చినగదిలి మండలంలోని గ్రామ సర్వే నెంబర్ 150లో నిబంధనలకు విరుద్ధంగా కైలాసగిరి కొండను తవ్వేసి వ్యాపారాల కోసం చేపడుతున్న నిర్మాణాలపై అభ్యంతరాలు చెబుతూ, తగిన చర్యలు తీసుకోవాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ జిల్లా కలెక్టర్ మల్లికార్జున్ ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని స్పందనలో వినతి పత్రం అందజేశారు.

తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖ తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని రుషికొండలో పెద్ద ఎత్తున విధ్వంసం చేస్తూ, కొండలను ధ్వంసం చేసి మైనింగ్ ను అక్రమంగా తరలిస్తున్నారన్నారు.అదే విధంగా ఏయూలోని చెట్లను కొట్టేసి పర్యావరణానికి విఘాతం కలిగించిన,పట్టించుకోని ప్రభుత్వంలోని ఉన్నత అధికారులపై జనసేన ఎప్పటికప్పుడు పోరాడుతుందని స్పష్టం చేశారు.తెన్నేటి పార్క్ ఎదురుగా ఉన్న కైలాసగిరి కొండను పెద్ద ఎత్తున అక్రమంగా తవ్వేస్తున్నారని, 2019లోని సీ ఆర్ జెడ్ నోటిఫికేషన్ వర్తించదా అని జిల్లా కలెక్టర్ని నిలదీయడం జరిగిందన్నారు.పార్కింగ్ ప్లేస్ లో వ్యాపార కేంద్రాలకు ఎలా కేటాయిస్తారని అడిగామ్మన్నారు.అధికారులు ప్రకృతి విధ్వాసానికి పాల్పడుతూ వాటిని వైసిపి అధికారులకు కట్టబెట్టడానికి ఉన్నారా అని ప్రశ్నించామన్నారు. ప్రకృతి విధ్వాసం చేయడానికి జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని విమర్శించారు.

తవ్వకాలతో పాటు అక్రమ మైనింగ్ ను నిలిపివేయాలని జనసేన నేత డిమాండ్ చేశారు.

కొండలను తవ్వితే తిరిగే కాపాడుకోలేమని న్యాయమూర్తులు చెప్తున్నారని గుర్తు చేశారు.ప్రకృతిని, కొండలను పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ కు వినతివ్వడం జరిగిందని మూర్తి యాదవ్ వివరించారు. కలెక్టర్ ను కలిసిన వారిలో జన సైనికులు ఎర్రంశెట్టి సురేష్ బాబు, వీర మహిళా రూప కూడా ఉన్నారు.

# సనపల ఢిల్లీ టీం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరానికి విశేష స్పందన



గాజువాక(విజయభాను న్యూస్) : అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక ఇబ్బంది పడుతున్న బాధితులకు సరైన సమయంలో రక్తం అందించి ప్రాణదానం చేయడానికి ఇటువంటి రక్తదాన శిబిరాలు ఎంతో దోహదపడతాయని పలువురు ప్రముఖులు అన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా అక్టోబర్ మొదటివారం ఢిల్లీ సనపల టీం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరానికి రాజకీయ, పోలీస్ ఇతర రంగ ప్రముఖులు విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా రక్తదానం చాలా గొప్పది అన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేయడంలో ఢిల్లీ సనపల టీం సభ్యులు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో సుమారు 222 యూనిట్ల రక్తాన్ని సేకరించడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడంలో అపోహలను విడనాడి రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో టీమ్ ఢిల్లీ స సభ్యులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలి




ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్)** : ఆంధ్రవిశ్వవిద్యాలయం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం ఆధ్వర్యంలో మైక్రో ప్లాస్టిక్స్ ఇన్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ అంశంపై మూడు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ముగిసాయి. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత ముగింపు సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆచార్య కె.సమత మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. ప్లాస్టిక్ కాలుష్యం ఫలితంగా సముద్ర జీవులకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. యూరోపియన్ కమీషన్ అందించిన ప్రాజెక్టులో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెత్తం 25 మంది పరిశోధకులు, అధ్యాపకులు, సహాయ ఆచార్యులు, మత్స్యశాఖ, జీవీఎంసీ అధికారులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, డాక్టర్ కె.ఉమాదేవి, విభాగ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# "కాలుష్య నిర్మూలనకు సహకరించండి"

## - జి.వి.యం.సి.కమిషనర్ సి.ఎం.సాయి కాంత్ వర్మ.



విశాఖపట్నం, అక్టోబర్ 09:- కాలుష్య నిర్మూలనకు నగర ప్రజలకు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ పేర్కొన్నారు. సోమవారం ఆయన నగర కాలుష్య నిర్మూలనలో భాగంగా తమ క్యాంపు కార్యాలయం నుండి సైకిల్ పై జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని, నగరంలో శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా నగర ప్రజలు సాధ్యమైనంత వరకు ప్రజా రవాణాన్ని ఉపయోగించాలని కాలుష్య రహిత వాహనాలను వినియోగించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. కాలుష్య నియంత్రణకు జివిఎంసి ఇప్పటికే ఎన్నో చర్యలు చేపట్టిందని అందులో భాగంగా ప్రతి సోమవారం ఉద్యోగులతో పాటు అధికారులు ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే కాలుష్యం నియం త్రణకు స్వచ్ఛంద సంస్థలు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు సహకరించాలని కోరారు.

# భౌతిక శాస్త్ర విభాగంలో జాతీయ సదస్సు

ఆంధ్రవిశ్వవిద్యాలయం **(విజయభాను న్యూస్)** : ఆంధ్రవిశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో నవంబరు 2-4 వ తేదీ వరకు ద్రవ స్ఫటికాలపై నిర్వహించే మూడు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో విడుదల చేసారు. ఈ సదస్సుకు శాస్త్రవేత్తలు, పరిశోధకులు 250 మందికిపైగా హాజరై తమ పరిశోధన పత్రాలను సమర్పిస్తారన్నారు. విదేశాల నుంచి పలువురు శాస్త్రవేత్తలు తమ పరిశోధన పత్రాలను సర్పిస్తున్నారు. కార్యక్రమానికి డిఎస్‌టి సహకారం అందిస్తోంది.కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య కె.బసవయ్య, కన్వీనర్ డాక్టర్ రామకృష్ణ నాంచార రావు, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాస రావు, ఆచార్య ఎన్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## పొదుపు మంత్రం !

నిత్య జీవితంలో ఆదాయాలు పెరుగుతున్నట్లుగా కనిపించినా... ఖర్చులు అంతకు రెట్టింపవుతున్నాయి. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్ వచ్చి...చిన్న షాపులనే కాదు... చిన్న కుటుంబాలనూ మింగేస్తున్నాయి. డిస్కౌంట్‌ల పేరుతో ఊరిస్తూ...మనసును ప్రలోభపెడుతుంటాయి. అవసరమున్నా లేకున్నా...జేబులో డబ్బులు, మన బడ్జెట్ ఎంత? అన్న లెక్కలన్నీ తారుమారైపోతున్నాయి. మనిషి బలహీనతను మాల్స్ రూపంలో వున్న తిమింగలం మింగేస్తున్నది. నట్టింట్లో టీవీ, అరచేతిలో స్మార్ట్‌ఫోన్ వుంటే చాలు....కార్పొరేట్ ప్రపంచంలోని రకరకాల ప్రకటనలు ప్రలోభపెడుతూనే వుంటాయి. డిస్కౌంట్లు, ఇఎంఐలు, క్రెడిట్ కార్డులు మన నియంత్రణను పరీక్షిస్తుంటాయి. బైక్, కారు, ఇల్లు, బంగారం, ఫ్రిజ్, టీవీ... ఇలా ఆర్థిక స్థితిని మించి కొనేయడం, వాటికి ఏళ్ల తరబడి వాయిదాలు కడుతూనే వుంటాం. ఈ పద్ధతే అవసరాలకు, ఆర్థికానికి మధ్య తీవ్రమైన అంతరాన్ని మిగుల్చుతున్నది. ఈ రెండిటి మధ్య తేడాను తెలుసుకోగలిగితే పొదుపు అలవాటు చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ, అదే పెద్ద కష్టం.

ప్రతి ఒక్కరి జీవితంలో అవసరాలు, అత్యవసరాలు, ఆనందాలు వుంటాయి. అవసరం వేరు, ఆర్భాటం వేరు. డబ్బే జీవితం కాదు. కానీ, ప్రతి అవసరానికీ, ఆనందాలకీ, సరదాలకీ డబ్బు కావాల్సిందే. అదే సందర్భంలో నిత్యం పెరిగే ధరలు, నిలకడలేని ఉద్యోగాలు, అనుకోని అనారోగ్యాలు-అన్నీ మనిషిని ఇబ్బంది పెట్టేవే. దేనికి ఖర్చు చేయాలి, దేనికి అవసరంలేదు అనే నియంత్రణ మనిషికి అవసరం. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పొదుపు చేయడం ప్రారంభిస్తే...జీవితంలో ఆర్థిక లోటు ఏర్పడదు. అయితే- భారతీయుల్లో తక్కువ పొదుపు...ఎక్కువ రుణాలు పెరిగాయని, 2022-23లో నికర గృహ ఆర్థిక పొదుపు జిడిపిలో 5.1 శాతానికి పడిపోయిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన తాజా నివేదికలో వెల్లడించింది. కరోనా తర్వాత బ్యాంకుల దూకుడు రుణ వ్యూహాల కారణంగా 30 కోట్లకు పైగా భారతీయ కుటుంబాల రుణ స్థాయిలు పెరిగాయి. 2021-22 చివరి నాటికి రూ.1.48 లక్షల కోట్లున్న క్రెడిట్ కార్డుల బకాయిలు 2022-23 నాటికి రూ.1.94 లక్షల కోట్లకు పెరిగాయి. ఆస్తుల స్థాయిలు పడిపోవడంతో... ఆర్థిక భారాలు పెరగడం అనేది పెరుగుతున్న అసమానతలకు సంకేతం. 'నీ మనసుని, శరీరాన్ని ఆరోగ్యంగా అట్టేపెట్టని ఖర్చు ఒక్క దమ్మిడీ చెయ్యకు' అంటాడు కొడవటిగంటి. ఇది వ్యక్తులకే కాదు....పాలకులకు, ప్రభుత్వాలకూ వర్తిస్తుంది. నయా ఉదారవాద ఆర్థిక విధానాల పుణ్యమాని... ప్రపంచంలో వినిమయదారీ సంస్కృతి విపరీతంగా పెరిగింది. చేతిలో నయాపైసా లేకపోయినా, మధ్యతరగతి జీవితాలను ఆశల పల్లకిలో విహరింపజేస్తూ... క్రెడిట్ కార్డులు, ఇఎంఐ ల రూపంలో వున్నదంతా ఊడ్చేస్తున్నారు. 'అప్పు తెచ్చి వేసిన మిద్దెల్లో/ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్న దీనత్వం నీది' అంటాడు చెరబండరాజు. ఇలాంటి ప్రతి సందర్భాన్నుంచీ బయటపడేసేదే పొదుపు. అలాంటి పొదుపు పట్ల ప్రజల్లో స్పృహ కలిగించడం కోసం ప్రతి ఏడాది అక్టోబర్ 12న 'జాతీయ పొదుపు దినోత్సవం' జరుపుకుంటున్నారు.

మన ఆర్థిక అలవాట్లను పునరాలోచించుకోవడానికి, వాస్తవిక లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి...సురక్షితమైన, సుసంపన్నమైన భవిష్యత్ కోసం పొదుపు పాటించడం అవసరం. పొదుపు కేవలం వ్యక్తిగత ప్రయోజనమే కాదు... సామాజిక బాధ్యత అని ఈ రోజు గుర్తు చేస్తుంది. పొదుపు అలవాటు ప్రారంభంలో కొంత కష్టమనిపించినా... తినగ తినగ వేము తీయనుండు అన్నట్టుగా తర్వాత్తర్వాత సులభమవుతుంది. 'ఇదమే వహి పాండిత్యం/ ఇదమే వహి శూరత/ ఇదమే వహి వైదగ్ధ్యం/ ఆదాదల్పతరో వ్యయ:' అన్నారు. ఆదాయం కన్నా చాలా తక్కువ ఖర్చుపెట్టడమే...ఏ మనిషి విజ్ఞానానికైనా, శూరత్వానికైనా, నేర్పుకైనా నిదర్శనం-అని ఈ శ్లోకం చెబుతుంది. పొదుపు ఒక్క డబ్బు విషయంలోనే కాదు-కాలం, వనరులు, నీరు, చెట్టు, విద్యుత్, ఆహారం వంటి అన్నిటిలోనూ అవసరమే. డబ్బుతో పాటు ప్రకృతి వనరులు ఏ ఒక్కటి వృధా అయినా... దాని ఫలితం భవిష్యత్తరాలు ఎదుర్కోవాల్సి వుంటుంది. పొదుపు అనే దివిటీని చేపట్టి... ఆర్థికంగా సుస్థిరమైన భవిష్యత్తు వైపునకు అడుగులు వేద్దాం.

# తరతరాలుగా మీ ఐకమత్యం మరువలేనిది... ఎమ్మెల్యే ద్వారంపూడి

పట్నాల చిట్టయ్య సెంటర్లో మహానసంతర్పణ...
వెండి, బంగారం, డైమండ్స్ వర్తక సంఘం ఆధ్వర్యంలో 84వ గణపతి నవరాత్రి మహోత్సవం...
ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి..
డ్రా లో గెలుపొందిన వర్తక సంఘ సిబ్బందికి బహుమతులు అందజేత..
వర్తక సంఘ అధ్యక్షులు అనిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ద్వారంపూడిని ఘనంగా సత్కరించిన వర్తక సంఘం...




కాకినాడ .... పట్నాల చిట్టి సెంటర్లో 84వ శ్రీ గణపతి నవరాత్రి మహోత్సవాల పురస్కరించుకొని బంగారం వెండి మరియు డైమండ్స్ వర్తక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగినటువంటి మహా అన్నసంతర్పణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి విచ్చేసి అన్నసంతర్పణలో పాల్గొన్నారు. కాకినాడ నగర వెండి బంగారం డైమండ్స్ వర్తక సంఘం అధ్యక్షుడు రామకృష్ణ అనే రాము ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ద్వారంపూడి కి ఘన స్వాగతంతో ఘనంగా సత్కరించారు. అనంతరం గణపతి నిమర్జనం రోజున పాల్గొన్న వర్తక సంఘం సిబ్బంది డ్రాలో గెలుపొందిన వారికి మిక్సీ, సైకిల్, గ్రైండర్, వాటర్ కెటిల్, వెండి దేవుని పూజ సామాగ్రి, ఎలక్ట్రిక్ కుక్కర్, క్రాంప్టన్ ఫ్యాన్, వాషింగ్ మిషన్, మిక్సీ, గోల్డ్ రింగ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాకినాడ పట్టణానికి ఎంతో చరిత్ర కలిగిన గోల్డ్ మార్కెట్ సెంటర్ వద్ద ఇన్ని సంవత్సరాలుగా ఐకమత్యంతో గణపతి నవరాత్రుల నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని ఆనందం వ్యక్తం చేసి సుమారు 5000 మంది భక్తులకు అన్నసంతర్పణ చేసిన అన్నదాత జి ఎస్ బ్రదర్స్ జువెలర్స్ అధినేత గుత్తుల శ్రీనివాస్, కమిటీ చైర్మన్ నెల్లిపూడి ఉదయ భాస్కర్, కార్యదర్శి మహాడిక్ శ్రీనివాస్ , వర్తక సంఘ అధ్యక్షులు అనిశెట్టి రామకృష్ణ. ఉపాధ్యక్షులు బహదూర్ లను గుస్సాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఫ్రూటీ సుబ్బారావు, గోవిందరాజులు, వర్తక సంఘం, కార్యవర్గం పాల్గొన్నారు.

## ప్రభుత్వ దుకాణాల్లో అధిక ధరలకు మద్యం విక్రయాలపై పితాని ఫిర్యాదు



కాకినాడ, అక్టోబర్ 9: ప్రభుత్వం నిర్వహిస్తున్న మద్యం దుకాణాలలో అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారని పితాని చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు పితాని వెంకట రాము ఫిర్యాదు చేశారు. సోమవారం కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో పితాని ఫిర్యాదు చేశారు.

కాకినాడ నగరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్యం అవుట్లెట్లు, కొన్ని ప్రభుత్వ దుకాణాల్లో ఒక్కొక్క బాటిల్పై 20 రూపాయల నుంచి 50 రూపాయల వరకు అధికంగా ఎమ్మార్పీ కంటే వసూలు చేస్తున్నారన్నారు. అలాగే ఈ దుకాణాల్లో ఇంకా వినియోగదారులకు బాటిల్ తీసుకున్న తర్వాత ఇవ్వవలసిన నగదును కూడా ఇవ్వకుండా వారిని బయటకు క్యూ లైన్ల నుండి తోసేస్తున్నారన్నారు. ఈ విషయాన్ని సంబంధిత ఎక్సైజ్ శాఖకు ఫిర్యాదు చేసినా అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇలా కాకినాడ, నగర పరిసర ప్రాంతాల నుంచి రోజుకు మద్యం ప్రియుల నుంచి సుమారు లక్ష రూపాయలు పైబడి మద్యం దుకాణదారులు దోచేస్తున్నారన్నారు. ఈ విధంగా కాకినాడ పరిసర ప్రాంతంలో నెలకి సుమారు లక్ష రూపాయల నుంచి లక్షా యాభై వేల వరకు వీటిలో పనిచేస్తున్న వారికి చేరుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉందని అందువల్ల వీరు అక్రమంగా మద్యం ప్రియుల నుంచి వసూలు చేసిన నగదును తిరిగి ప్రభుత్వ ఖజానాకు చెల్లించేలా చర్యలు చేపట్టాలని పితాని రాము సూచించారు.

## వేడుకగా శ్రీ కాశ్యప్ డిగ్రీ కళాశాల పట్టభద్రుల మరియు వీడ్కోలు దినోత్సవం



విశాఖపట్నం **(విజయభాను న్యూస్)** :మదినిండా అధ్యయన ఫలాలు.... కళ్ళల్లో పసిడి కాంతులు....... ఆచార్య ఆశీర్వాదాలతో అపురూప ఘట్టానికి వేడుకైనది శ్రీ కాశ్యప్ డిగ్రీ కళాశాల 2020- 2023 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులు స్నాతకోత్సవం మరియు వీడ్కోలు వేడుకలను అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థిని CH. కిరణ్మయి తన అకాడమిక్ నైపుణ్యం ఎక్స్ట్రా కరిక్యులర్ ప్రతిభ ఆధారంగా స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ గా బంగారు పతకం సాధించగా మిగతా విద్యార్థులు డిగ్రీలు అందుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ రవిశంకర్ వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులే దేశానికి గొప్ప ఆస్తి అని యువతరం గ్రాడ్యుయేట్లు పారిశ్రామిక విజయానికి ఆశా కిరణమని అన్నారు. గ్రాడ్యుయేషన్ చేసినందుకుగాను అనేకమంది శ్రీ కాశ్యప్ విద్యార్థులను కరస్పాండెంట్ సత్కరించారు మరియు విద్యార్థుల కృషిని అభినందించారు. అనంతరం కళాశాల విద్యార్థిని విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రవిశంకర్ వర్మ డైరెక్టరు ఎస్. నారాయణమూర్తి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పి. సత్యనారాయణ, మరియు డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ ఎల్. జోత్స్న, అధిక సంఖ్యలో అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఆనందోత్సాహాల నడుమ ఘనంగా పట్టభద్రుల మరియు వీడ్కోలు దినోత్సవం జరిగినది.

## కవి సమయం

### మనసు మాట వినదు

మనసుపై ఆధిపత్యం సాధించినవాడే విజయుడు
మానసిక చిత్తవృత్తులను నిరోధించటమే మహారాజయోగం
మనిషి నడవడిక మనసుపై ఆధారం
మనసే మనిషికి మకుటంలేని మహారాజు
స్పందించటం మనసు లక్షణం
నిలకడలేనితనం దీని దుర్గుణం
విసుగు, విరామం లేకుండా అవిశ్రాంతంగా
ఊసరవెల్లిలా దేహాన్ని, రూపాన్ని,
బుద్ధిని బట్టి లక్షణాలను మార్చుకుంటుంది
మనసు అనురక్తికి అంతు లేదు
మనిషిని కీలుబొమ్మను చేసి ఆడిస్తుంది
మనసుకు అభ్యాసాన్ని అలవరిస్తే,
దివ్యత్వాన్ని అందిస్తుంది
మనసుతోనే పరమాత్మను చూడగలం

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

| ఏకాదశి మ. 3.09<br>ఆశ్రేష ఉ. 7.04, వ.రా. 8.22ల 10.08 | ఆదివారం<br>08-10 -2023 |
|---|---|

**మేషం** : ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యంతో ఏకీభావం లోపిస్తుంది. భార్య, భర్తల మధ్య మనస్పర్థలు సమసిపోతాయి. వైద్య రంగాల్లోనివారికి శస్త్రచికిత్సల సమయంలో ఏకాగ్రత అవసరం. స్త్రీలకు పనివారలతో సమస్యలు తలెత్తినా నెమ్మదిగా సమసిపోతాయి. **వృషభం** : ఉద్యోగస్తులు, రాజకీయ నాయకులు సభలు, సమావేశాలలో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకటు కుంటారు. కానివేళలో ఇతరుల రాక ఇబ్బంది కలిగిస్తుంది. మీ సంతానం కోసం నూతన పథకాలు రూపొందిస్తారు. కళాకారులకు, రచయితలకు, పత్రికా రంగంలో వారికి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. **మిథునం** : ఉపాధ్యా యులకు విద్యార్థుల వల్ల సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది జాగ్రత్త వహించండి. స్త్రీలకు అయిన వారి రాక సంతోషం కలిగిస్తుంది. సిమెంటు, కలప, ఐరన్, ఇటుక, ఇసుక వ్యాపారులకు కలిసిరాగలదు. మానసిక ఆందోళనవల్ల పెద్దల ఆరోగ్యం విషయంలో సంతృప్తి కానరాదు. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండటం క్షేమ దాయకం. **కర్కాటకం** : ఆకస్మిక ప్రయాణాలు వాయిదా పడ తాయి. నిరుద్యోగులు ఒక ప్రకటన పట్ల ఆకర్షితులవుతారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. స్థిరాస్తుల కొనుగోలు యత్నాలు అను కూలిస్తాయి. **సింహం** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయ మనం పాటిం చండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదుర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తా లకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. కట్టడాల అక్రమాల నిర్మాణంలో సమస్యలను ఎదుర్కొంటారు. నోరు అదుపులో ఉంచుకోవడం శ్రేయస్కరం. ఉత్తర ప్రత్యుత్తరాలు సంతృప్తిగా సాగుతాయి. **కన్య** : స్త్రీలతో సంభాషించేటపుడు సంయమనం పాటించండి. ప్రయాణాల్లో అధిక శ్రమ ఎదు ర్కొనక తప్పదు. ప్లీడర్లకు, ప్లీడర్ గుమస్తాలకు వృత్తిపరమైన చికాకులు తప్పవు. పోస్టల్, ఎల్.ఐ.సి, ఏజెంట్లకు పురోభివృద్ధి. వ్యవసాయ, తోటల రంగాల వారికి నూతన ఆలోచనలు స్ఫురిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. **తుల** : స్త్రీలతో కలహములు, అన్ని కార్యముల యందు విఘ్నములు ఎదుర్కొంటారు. కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటి పైనే శ్రద్ధ వహించండి. పత్రికా సిబ్బందికి వార్తల ప్రచురణలో పునరాలోచన మంచిది. ఏ వ్యక్తికీ అతి చనువు ఇవ్వటం మంచిది కాదు. రుణాలు, పెట్టుబడుల కోసం ప్రయత్నిస్తారు. **వృశ్చికం** : కుటుంబ అవసరాలకు, మీ సంతానం కోసం ఫీజులు, బిల్లులవు చెల్లిస్తారు. వృత్తుల్లో వారికి గుర్తింపు లభిస్తుంది. ముక్కుసూటిగా పోయే మీ తీరు ఇబ్బందులకు దారితీస్తుంది. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనివారలతో చికాకులను ఎదుర్కుంటారు. **ధనుస్సు** : ఉద్యోగస్తులకు అధికారుల తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. ఒక అవసరానికి ఉంచిన ధనం మరో ఖర్చుకు వినియోగించవలసి వస్తుంది. స్త్రీలు తేలికగా మోసపోయే ఆస్కారం కలదు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఒత్తిడి, పనివారలతో చికాకులు తప్పవు.. **మకరం** :ఉపాధ్యాయులకు నూతన వాతావరణం, పరిస్థితులు ఆందోళన కలిగిస్తాయి. సంఘంలో పలుకుబడి గల వ్యక్తుల సహకారంతో మీ పనులు సాను కూలమవుతాయి. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. **కుంభం** : గృహంలో నూతన వస్తువులను అమర్చు కోగలుగుతారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు తొలగిపోతాయి. వస్త్ర, బంగారం, వెండి ఫ్యాన్సీ వ్యాపారాల్లో పోటీతత్వం అధికంగా ఉంటుంది. **మీనం** : ప్రింటింగ్ రంగాల వారికి బకా యిల వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. బంధువులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేయునపుడు పునరాలోచన అవసరం. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

# పవిత్ర లింగాలు... పంచారామాలు..!


## సంకీర్తన





శివకేశవులకి భేదం లేదు. శివుడే విష్ణువు, విష్ణువే శివుడు. శివుడు ఎక్కడ ఉంటాడో విష్ణువు అక్కడే ఉంటాడు. విష్ణువు ఉన్నచోటే శివుడూ కొలువవుతాడు. శివకేశవుల్లోని ఆ ఏకత్వాన్ని తెలిపే పవిత్ర క్షేత్రాలే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెలసిన పంచారామాలు...
'శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే
శివస్య హృదయం విష్ణుర్విర్ణోశ్చ హృదయం శివః'... అంటే, శివుని రూపమే విష్ణువు. విష్ణువు రూపమే శివుడు. శివుడి గుండెల్లో కొలువైనది విష్ణువే. విష్ణువు హృదయమే శివుడి ఆవాసం... అన్న అర్థాన్ని చాటే ఈ శ్లోకం యజుర్వేదంలోనిది. పంచారామాలుగా మనం పిలిచే ఆ ఐదు క్షేత్రాల్లోనూ కొలువున్నది శివుడే. క్షేత్రపాలకుడు విష్ణువు. పైగా ఆ శివలింగాలన్నీ ఒకే లింగం నుంచి ఉద్భవించినవే. తారకాసురుడు పరమశివభక్తుడు. తపస్సు చేసి శివుడి ప్రాణలింగాన్ని వరంగా పొందిన గర్వంతో దేవలోకంపైకి దండెత్తి, ఇంద్రుణ్ణి ఓడిస్తాడు. దాంతో దేవతలంతా తారకాసురుణ్ణి సంహరించమని ఆ శ్రీమహావిష్ణువుని కోరగా, ఆ శ్రీహరి 'తారకుడు శివభక్తుడు. శివుడి ప్రాణలింగాన్ని పొందినవాడు. నేను వధించలేను. శివుణ్నే ఆశ్రయించండి' అని చెప్పాడు. అప్పుడు దేవతలు శివుణ్ణి శరణు కోరగా 'నా ప్రియభక్తుడైన తారకుణ్ణి నేను చంపలేను. మిమ్మల్నీ కాదనలేను. కుమారస్వామి వధిస్తాడు' అని చెబుతాడు. అంతట ఆ షణ్ముకుడు దేవసేనకు సారథ్యం వహించి తారకుడితో యుద్ధం చేశాడు. శక్తి ఆయుధంతో ఎన్నిసార్లు ఆ అసురుడి శరీరాన్ని ముక్కలుగా చేసినా మళ్లీ అతుక్కుపోతున్నాయి. ఏం చేయాలో తెలియని స్థితిలో ఉన్న కుమారస్వామికి శివుడు ప్రత్యక్షమై, 'కుమారా ఆందోళన చెందకు. తారకుడి కంఠంలో నా ప్రాణలింగం ఉన్నంతవరకూ అతను చనిపోడు. దాన్ని ముక్కలుచేయాలి' అని చెబుతాడు. అప్పుడు కుమారస్వామి ఆగ్నేయాస్త్రంతో ఆ లింగాన్ని ఐదు ముక్కలు చేయగా అవి కృష్ణా, గోదావరీ తీరాల్లో పడ్డాయి. ఓంకార నాదంతో అవి మళ్లీ ఏకమవబోతుండగా విష్ణుమూర్తి ఆదేశం మేరకు పడ్డ చోటే ఆ లింగ శకలాలను దేవతలు వెంటనే ప్రతిష్ఠించి ఆలయాలు నిర్మించారన్నది పౌరాణిక కథనం. అవే ద్రాక్షారామం, అమరారామం, క్షీరారామం, సోమారామం, కుమారారామాలు.

క్షీరారామం! క్షీర రామలింగేశ్వర స్వామిగా పూజలందుకుంటోన్న ఈ క్షేత్రం పశ్చిమగోదావరిజిల్లాలోని పాలకొల్లులో ఉంది. పంచారామాల్లోని మిగిలిన నాలుగు క్షేత్రాల్లో లింగశకలాలను దేవతలు ఒకేసారి ప్రతిష్ఠించగా, క్షీరారామంలో మాత్రం త్రేతాయుగంలో రాముడు ప్రతిష్ఠించాడట. ఇక్కడి శివలింగం రెండున్నర అడుగుల ఎత్తులో తెల్లగా ఉంటుంది. అందుకే దీనికా పేరు. ఉత్తరాయణ, దక్షిణాయన ప్రారంభంలో ఉదయంవేళలో సూర్యకిరణాలు గోపురం రెండో అంతస్తు నుంచి లింగంమీద పడతాయి. గర్భగుడిలోని మూలవిరాట్టును నలువైపులా ఉన్న కిటికీలనుంచి చూడవచ్చు. తొమ్మిదో శతాబ్దంనాటి చాళుక్యులే ఈ ఆలయాన్నీ కట్టించినట్లు చెబుతారు. 120 అడుగుల ఎత్తులో తొమ్మిది అంతస్తుల్లో నిర్మించిన గోపురం ఈ ఆలయ ప్రత్యేకత. ఆలయ క్షేత్రపాలకుడు జనార్ధనుడు. ఇక్కడ ఒక్కరోజు ఉంటే ఏడాదిపాటు కాశీలో ఉన్న పుణ్యం దక్కుతుందట. సూర్యభగవానుడు, సప్తమాతృక, పార్వతీదేవి, బ్రహ్మ, సరస్వతి, కనకదుర్గ, కాలభైరవ, నటరాజు, దత్తాత్రేయ... ఇలా పలు దేవతలూ కొలువయ్యారిక్కడ. ఏలూరుకి సుమారు 110 కి.మీ.దూరంలో ఉందీ ఆలయం. ...సశేషం


క్షీరారామం



## బైరాదిలీప్ చక్రవర్తిని కలిసిన మాజీ జడ్పీటీసీ పైలా



పరవాడ :-హైదరాబాదులో ప్రముఖ పారిశ్రామికవేత్త,బైరా ఫౌండేషన్ చైర్మన్ బైరా దిలీప్ చక్రవర్తిని, పరవాడ మాజీ జడ్పిటిసి, మాజీ ఎంపీపీ, మాజీ ఆర్ఈసిఎస్ చైర్మన్, మాజీ ఉత్తమ జడ్పిటిసి అవార్డు గ్రహీత పైల జగన్నాధరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.. అనంతరం దుస్సాల్వతో ఘనంగా సత్కరించారు.. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పైల జగన్నాధ రావు తనయుడు పైలు మధుబాబు తదితరులు పాల్గొన్నారు

## 5 లో చేతి పంపు బోర్లు మంజూరు



మధురవాడ (విజయభాను న్యూస్) : దశాబ్ద కాలంగా తాగు నీటి సమస్యలు ఎదుర్కుంటున్న 5 వ వార్డు ప్రజలకు కార్పొరేటర్ మొల్లి హేమలత అండగా నిలిచి చేతి పంపు బోర్లు ఏర్పాటు చేసి నీటి కష్టాలు తీర్చారు. గత కౌన్సిల్ సమావేశాలలో మంజూరైనా బోర్లను మహా విశాఖ 5 వ వార్డు పరిధిలో వైయస్సార్ కాలనీ, స్వాతంత్ర నగర్, జే ఎన్ ఎన్ యు ఆర్ ఎమ్ పిపి 2 కాలనీ తదితర ప్రాంతాల్లో సోమవారం చేతి పంపు బోర్ల ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వార్డులో త్రాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో ఈ చేతి పంపు బోర్ల వేయడం జరుగుతుందని, ఇంకా వార్డులో అనేక చోట్ల త్రాగునీటి పైపు లైన్లు మరియు చేత పంపు బోర్లు అవసరం ఉందని వాటి గురించి మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని అవి కూడా తొందరలోనే మంజూరు అవుతాయని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వార్డు ఉపాధ్యక్షులు వియ్యపు నాయుడు, ఓలేటి శ్రావణ్, నూకరాజు, ఐటిడీపీ మాదాల విజయ్, మోహన్ , మహమ్మద్ అలీ, మురళి,కోళ్ల వెంకటేష్, పిళ్ళా అప్పన్న, కందుల సత్యనారాయణ, పెంటరావు, చందు, ప్రవీణ్, రామకృష్ణ, అరుణ, లక్ష్మి, శ్రావణి,వార్డులో గల మహిళలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుపై అక్రమ స్కిల్ కేసుకు నిరసన వ్యక్తం చేసిన విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు

ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం పాటుపడిన వ్యక్తి చంద్రబాబు: విశ్వబ్రాహ్మణ బీసీ సాధికారిక కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.శ్రీను వాసరావు



రాజాం : మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పై అక్రమ కేసుకు నిరసనగా రాజాం తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద సామూహిక రిలే నిరాహారదీక్షను కార్యక్రమం మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీ మోహన్ ఆదేశాల మేరకు సోమవారం నాడు నిర్వహించారు.

చంద్రబాబు పై అక్రమ స్కిల్ డెవలప్మెంట్ కేసుకు నిరసనగా "బాబు గారికి తోడుగా ఒక నియంతపై పోరాటం కోసం మేము సైతం" కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ బీసీ సాధికారిక కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,జిల్లా అధ్యక్షులు ముగడ శ్రీను వాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్ రెడ్డి బీసీలను ఎంత సేపు ఓటర్లుగా చూడడమే తప్ప వారిని సాధికారిత దిశగా అడుగులు వేసేందుకు చర్యలు తీసుకోవాలన్న కనీస ఆలోచన చేయకపోవడం దుర్మార్గమని అన్నారు.జగన్ రెడ్డి 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశానని చెప్పడం తప్ప ఏం ఉద్దరించారని ప్రశ్నించారు.ఏ కార్పోరేషన్ ద్వారా కూడా పైసా ప్రయోజనం కల్పించిందిలేదు. కూర్చోడానికి కుర్చీలు కూడా లేని దుస్థితి కార్పొరేషన్లకు పట్టించారన్నారు.బీసీలకు అండగా నిలిచిన తెలుగుదేశం పార్టీని గెలిపించుకుని.రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా పురోగతి సాధించి బాబును గెలిపించుకుందాం బంగారు భవిష్యత్తును సాధించుకుందాం అని నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో బంగారు మోహనరావు, పొట్నురు చక్రపాణి, గురవాన నారాయణ రావు, టంకాల కన్నంనాయుడు, అలుగోలు సంగం,సూర్యారావు,సత్యం,లక్ష్మన రావు,బి సూర్యనారాయణ,బి వెంకటరావు,ఎం చిట్టి బాబు,ఎం సత్తిబాబు,జి పెంటయ్య,ఎటికోటి వెంకటరమణ,సేహెచ్ శేషగిరిరావు,విజయనగరం పార్లమెంటరీ బీసీ అధికారిక ప్రతినిధి మరిపి జగన్ మోహన్ రావు,పెంకి గౌరీశ్వరారావు,బోనేల నారాయణ రావు, బెజ్జిపురపు రవి,ధనుంజయ, నీలయ్య మాస్టర్,గుడివాడ ఉత్తర కుమార్,ఆటో కోటీ చిప్పాడ మధు, పిల్లా సత్యం నాయుడు తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## అమ్మవారి శరన్నవరాత్రుల ఉత్సవరాట



భీమునిపట్నం: విజయభాను న్యూస్ : భీమిలి మండలం మూలకుద్దు పంచాయితీలో శ్రీ దుర్గాదేవి అమ్మవారి శరన్నవరాత్రుల ఉత్సవరాట కార్యక్రమం సోమవారం ఉత్సవ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ నెల 15 వ తేదీ నుంచి మొదలై 24 వరకు ఘనంగా నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## దివిస్ ఆధ్వర్యంలో ఉచిత కళ్ళద్దాల పంపిణీ




భీమునిపట్నం : విజయభాను న్యూస్ భీమిలీ మండలం చిప్పాడ లో ఉన్న దివిస్ యాజమాన్యం వారు చుట్టుపక్కల ఉన్న గ్రామపంచాయతీలలో కంటి సమస్య ఉన్నవారికి 120 మందికి సుమారుగా 90 వేల రూపాయల విలువగల కళ్లద్దాలు చిప్పాడ సర్పంచ్ వెంపాడ రమావతి చేతులు మీదుగా అందజేశారు ఈ సందర్భంగా రమావతి మాట్లాడుతూ దివిస్ యాజమాన్యం వారు గ్రామపంచాయతీలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారు అందులో భాగంగా కంటి సమస్య ఉన్నవారికి వైద్య పరీక్షలు చేపించి ఉచిత కళ్లద్దాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ అధికారి నాగరాజు మాట్లాడుతూ దివిస్ యాజమాన్యం వారు ప్రతి సంవత్సరం కంటి శిబిరం ఏర్పాటు చేసి కంటి పరీక్షలు చేపించి కంటి సమస్య ఉన్నవారికి ఉచిత కళ్లద్దాలు ఇవ్వడం జరుగుతుంది అదేవిధంగా సెప్టెంబర్ నెలలో కంటి పరీక్షలు నిర్వహించి కంటి సమస్య ఉన్నవారికి ఈరోజు ఉచితంగా కళ్లద్దాలు ఇవ్వడం జరుగుతుంది అని అన్నారు అని అన్నారు. అదేవిధంగా కంటి శస్త్ర చికిత్సలు ఉచితం గా చేయించే విధంగా ఎల్.వి. ప్రసాద్ నేత్ర వైద్య మరియు విజ్ఞాన కేంద్రం వారి సహాయం అందిస్తున్నారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ నెంబర్లు, సిఎస్ఆర్ ప్రతినిధి కే నరసింహరావు తదితరులు పాల్గొన్నారు

## ఫ్రెండ్స్ వనిత వాకర్స్ ఆధ్వర్యంలో నడక పోటీలు



మధురవాడ (విజయభాను న్యూస్) : స్వర్గీయ ఆళ్వార్ దాస్ 94వ జయంతి సందర్భంగా సోమవారం మహా విశాఖ 6 వ వార్డు పరిధి పీఎం పాలెం, లక్ష్మి వాని పాలెంలో గల ఎం.పీ.వీ.పీ స్కూల్లో డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ వాకర్ ఉప్పలపాటి శుభ, ఫ్రెండ్స్ వనిత వాకర్స్ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పరుగు పందెం పోటీలు నిర్వహించి గెలిపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసారు. ఈ సందర్భంగా 101 గవర్నర్ గారు పిల్లల చేత వాకర్స్ ప్రేయర్ చదివించి వారికి ఆళ్వార్ దాస్ గురించి వారి ఆశయాలు వివరించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వనిత వాకర్స్ క్లబ్ పీఎం పాలెం ప్రెసిడెంట్ వాకర్ D. రాజేశ్వరి, వాకర్ జ్యోతి కమల, వాకర్ అపర్ణ ,తులసీ నగర్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సెక్రటరీ వాకర్ A. శ్రీనివాసరెడ్డి, వాకర్ దావూద్, పాఠశాల ప్రిన్సిపల్ A. లక్ష్మీ, ఉపాధ్యాయాలు శేఖర్ తదితరులు పాల్గున్నారు.

## టి డి పి ఆధ్వర్యంలో 30 వ రోజు నిరాహార దీక్షా



భీమునిపట్నం : విజయబాను న్యూస్ నిర్వహించిన భీమిలి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి కోరాడ రాజబాబు స్థానిక టి డి పి కార్యాలయం ఆవరణలో .తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ భీమిలి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి మరియు కోరాడ రాజబాబు ఆధ్వర్యంలో 30 వ రోజు రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని భీమిలి రూరల్ మండల పార్టీ నాయకురాలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమిలి రూరల్ మండల పార్టీ అధ్యక్షులు డి ఏ ఎన్ రాజు రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు గాడు అప్పలనాయుడు మీసాల సత్యనారాయణ పార్లమెంట్ సెక్రెటరీ సరగడ అప్పారావు నియోజకవర్గ వాణిజ్య విభాగ ఉపాధ్యక్షులు యరబాల అనిల్ ప్రసాద్ తాళ్లవలస ఎంపీటీసీ కోరాడ రమణ సంకరభుక్త ప్రకాష్ కొక్కిరి అప్పన్న తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ముగిసిన అంతరిక్ష వారోత్సవాలు




భీమునిపట్నం : విజయభాను న్యూస్ శాటిలైట్ టెక్నాలజీ మానవ జీవన ప్రయాణాన్ని మార్చివేసింది అని డి.అర్. డి. ఓ ( నావల్ సిస్టమ్స్ - మెటీరియల్స్ ) డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాస రావు అన్నారు. షార్- ఇస్రో రఘు విద్యా సంస్థలు సంయుక్తంగా నిరహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల ప్రత్యేక కార్యక్రమం ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ శాస్త్ర జ్ఞాన్నాని నిత్య జీవితంలో అనువర్తిచాలని సూచించారు.

స్టార్ట్ అప్ రంగంలో యువత రాణించాలని చెప్పారు. భారత ప్రభుత్వం స్టార్ట్ అప్ ఇండియా తో యువతను అవిష్కర్తలుగా, పారిశ్రామిక వేత్తలు గా తీర్చిదిద్దుతోందని అన్నారు. భవిష్యత్తులో ప్రాథమిక శాస్త్రాలకు డిమాండ్ గణనీయంగా పెరుగుతుందని అన్నారు. అంతరిక్ష ప్రయోగాల విజయాలు నావిగేషన్, కమ్యూనికేషన్ రంగాలలో ప్రభావితం చేసిన విధానం, దృశ్య మాధ్యమం ప్రసారాలు, టెలిఫోన్ లో వచ్చిన అనేక మార్పులకు కారణమైన శాటిలైట్ విజ్ఞాన ఉపయోగాలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో చైతన్యం పెంచే దిశగా స్పేస్ వీక్ నిర్వహణ జరిగిందని షార్ శాస్త్రవేత్త, విశాఖ రీజియన్ కార్యక్రమ నిర్వహణ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సృజనాత్మకత అబ్బుర పరచిందని తెలిపారు. వీరి అలిచనలు మమ్మల్ని ఆలోచింపచేసే విధంగా ఉన్నాయన్నారు. విద్యార్థుల స్పందన అపూర్వమైనదన్నారు. ఈ కార్యక్రమాన్ని అంధ్రప్రదేశ్ తో పాటు ఒరిస్సా, తమిళనాడులోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించామని తెలిపారు.

రఘు విద్యా సంస్థల చైర్మన్ కలిదిండి రఘు మాట్లాడుతూ విద్యార్థులు, యువత నుంచి ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన వచ్చిందని, కార్యక్రమం అపూర్వ విజయం సాధించిందని అన్నారు. కార్యక్రమంలో భాగమైన షార్ శాస్త్రవేత్తలకు ధన్యవాదాలు తెలిపారు. షార్ ఎస్.ఓ.ఎస్.ఈ చీఫ్ జనరల్ మేనేజర్ పి. వెంకట రెడ్డి మాట్లాడుతూ అంతరిక్షంలో అపూర్వ విజయాలు భారత్ ఇటీవల కాలంలో సొంతం చేసుకుందని అన్నారు. చంద్రయాన్, ఆదిత్య ప్రయోగ విజయాలు భారత్ అంతరిక్ష పరిశోధన శక్తిని చాటాయని చెప్పారు. స్పేస్ ఎడ్యుకేషన్ సాధారణ విద్యార్థుల వద్దకు, భవిష్యత్ తరాలకు చేరువ చేస్తున్నామన్నారు. మన దేశ యువతలో అంతరిక్ష విజ్ఞానం పట్ల ఆసక్తి, ఉత్సుకత పెరుగుతున్నాయని చెప్పారు. భవిష్యత్తులో ఇది దేశానికి ఆదాయ వనరుగా అంతరిక్ష పరిశోధన రంగం నిలుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. యువత నిరంతర జ్ఞాన అన్వేషకులుగా మారాలని చెప్పారు. వరల్డ్ స్పేస్ వీక్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన రఘు కళాశాల యాజమాన్యాన్ని అభినందిస్తూ షార్ తరపున ప్రశంసా పత్రాన్ని రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘుకు ప్రధానం చేశారు.కార్యక్రమంలో షార్ ప్రతినిధి హరి కృష్ణ, ఎన్ ఎస్ టీ ఎల్ శాస్త్రవేత్త అర్. వి.ఎస్ సుబ్రమణ్యం, శ్రీధర్, షార్ శాస్త్రవేత్తలు, రఘు ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అంతరిక్ష విజ్ఞాన, వైజ్ఞానిక ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. భారత అంతరిక్ష పితామహులు విక్రమ్ సారాభాయ్ చేసిన కృషి, రాకెట్ల తయారీ, స్పేస్ మిషన్, లిక్విడ్ స్టేజెస్ ఆఫ్ రాకెట్స్, లూనార్ వెహికల్స్, శాటిలైట్ లు పనిచేసే విధానం, భారతీయ కమ్యూనికేషన్ శాటిలైట్ల పనితీరు, ప్రజలకు ఉపయుక్తంగా శాటిలైట్లు నిలుస్తున్న పద్ధతులను ప్రదర్శనలో వివరించారు.

వీటిని డాక్టర్ వై శ్రీనివాసరావు తో పాటు అతిథులు తిలకించారు.

వివిధ శాటిలైట్లు, రాకెట్ల నమూనాలు విద్యార్థులకు ఎంతో ఆసక్తిని కలిగించాయి. కార్యక్రమంలో రఘు కళాశాల విద్యార్థిని చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన అందరిని అలరించింది. నాలుగు రోజులు పాటు నిర్వహించిన ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల అవగాహన కార్యక్రమంలో ఉత్తరాంధ్రలోని ఐదు జిల్లాల నుంచి పాఠశాలలు, కళాశాలకు చెందిన 25 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొని సాంకేతిక ప్రదర్శనలను తిలకించారు.

## గడప గడపకు ప్రోగ్రాం లో సివిల్ వర్క్స్ పై సమీక్ష : కలెక్టర్ నిశాంత్ కుమార్

పార్వతీపురం/సాలూరు విజయభాను న్యూస్ అక్టోబర్ 9 గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన అభివృద్ధి పనులను పై సమీక్ష నిర్వహించిన పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్. సమన్వయ స్ఫూర్తితో పూర్తి చేసి ప్రగతి సాధించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సాలూరు నియోజక వర్గంలోని గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన వర్కుల పై సోమవారం సాయంకాలం సమీక్ష సమావేశం నిర్వహించారు. సాలూరు మున్సిపాలిటీ, మక్కువ, పాచిపెంట మండలాల గ్రామ సచివాలయం పరిధిలోని మంజూరైన పనులు వివిధ దశలలో ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు పూర్తయినప్పటికీ బిల్లులు అప్ లోడ్ చేయక పోవడానికి గల కారణాలను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బిల్లులు అప్లోడ్ చేయని కారణంగా బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగుతుందన్నారు. జిజిఎంపి పనులు బిల్లుల చెల్లింపులకు నిధులు పుష్కలంగా ఉన్నాయన్నారు. జిల్లాలో మరో రూ.11 కోట్ల వరకు అభివృద్ధి పనులకు కేటాయించేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ప్రస్తుతం మంజూరైన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఇంజనీరింగ్ సహాయకులు, ఇంజనీరింగ్ అధికారులు పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించారు. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఎవరినీ ఉపేక్షించేదిలేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే పది రోజుల్లో పెండింగ్ లో ఉన్న పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఐ టి డి ఎ ప్రాజెక్ట్ డైరెక్టర్



సి.విష్ణు చరణ్, డ్వామా పిడి కె.రామచంద్ర రావు, జిల్లా అర్ డబ్ల్యూ ఎస్ ఇంజనీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, సాలూరు మున్సిపల్ కమీషనర్ టి.జయరామ్, సాలూరు, మక్కువ మండల ఇంజనీరింగ్ అధికారులు రజిత్, వర లక్ష్మి, డి ఈ లు శ్రీరామ మూర్తి, డి.చిన్నం నాయుడు, ఏ ఈ ఎల్. సూరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# దైవారాధనలో రాగి పాత్ర

ఈ రోజుల్లో కూడా పూజాది కార్యక్రమాలకి వెండి, బంగారు పాత్రలు ఉపయోగించే వారు లేకపోలేదు. అయితే ఒకప్పటికంటే ఇప్పుడు అలాంటివారి సంఖ్య తగ్గిందనే చెప్పాలి. ఇక మధ్యతరగతి వారు కూడా ఇత్తడి - రాగి పాత్రలను వాడటం చాలావరకు తగ్గించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఎవరి ఇంట్లో చూసినా స్టీలు పాత్రలే దర్శనమిస్తున్నాయి. పూజకి ఉపయోగించే అన్ని రకాల పాత్రలు నేడు స్టీలులోనే కనిపిస్తున్నాయి. నగిషీ కారణంగా స్టీలు ... ఇనుము అనే భావన కలగనీయదు. ఈ కారణంగానే దీని వాడకం అంతకంతకూ పెరుగుతూపోతోంది.అయితే ఇటు ఆరోగ్యపరంగాను ... అటు ఆధ్యాత్మిక పరంగాను స్టీలు పాత్రలను వాడకూడదని శాస్త్రం చెబుతోంది.

**పూజలకు స్టీల్ పనికిరాదు:**

స్తోమత వుంటే వెండి - బంగారం, లేదంటే ఇత్తడి - రాగి పాత్రలను వాడటమే అన్ని విధాలా మంచిదని చెబుతోంది. స్టీలు ( ఇనుము) శని సంబంధమైన లోహం కనుక, దానికి బదులుగా ఇతరలోహాలతో చేసిన పాత్రలను మాత్రమే పూజకు వాడాలనీ, అప్పుడే ఎలాంటి దోషాలు లేని పరిపూర్ణమైన ఫలితాలను పొందవచ్చని స్పష్టం చేస్తోంది.

**రాగితో ఆరోగ్యం బోలెడు:**

గతంలో రాగి చెంబు, రాగి బిందె, రాగి గ్లాసు, రాగి ప్లేటు ఇలా ఎక్కువగా రాగి వస్తువులనే వాడే వారు. కాని నేడు ఫ్యాషన్ ఎక్కువయ్యి ప్లాస్టిక్ వచ్చిపడింది. దాంతో రాగి పాత్రల వాడకం బాగా తగ్గిపోయింది. నీళ్ళు తాగాలంటే ప్లాస్టిక్ బాటిల్స్, లంచ్ బాక్సులు కూడా ప్లాస్టికే. నేటి ఇళ్ళు మొత్తం ప్లాస్టిక్ సామానుల మయమైపోయాయి. అయితే రాగి పాత్రలు వాడడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

రాగిలో యాంటి బ్యాక్టీరియల్ నేచర్ ఉంటుంది. రాగితో చేసిన పాత్రలలో సూక్ష్మ క్రిములు చేరే అవకాశం ఉండదు. కాబట్టి ఇందులో నిల్వచేసే పదార్థాలు చెడిపోయే అవకాశాలు చాలా తక్కువ.

మనకి వచ్చే చాలా రోగాలకి నీటి కాలుష్యం ముఖ్యమైన కారణం. రాగి పాత్రలలో నీళ్ళు ఉంచితే అందులో క్రిములు చేరే అవకాశం చాలా అరుదు. అందుకే పాత రోజుల్లో రాగి బిందెలు వాడేవారు.

చెవులు కుట్టినప్పుడు కూడా చిన్న పిల్లలకి కొన్ని చోట్ల మొదటిసారి రాగి తీగలు చుడతారు. ఎందుకంటే పుండు పడకుండా ఉండటానికి. రాగికి వున్న ఆంటి బ్యాక్టీరియల్ లక్షణం పిల్లలకు ఆ ప్రమాదం రాకుండా చేస్తుంది.

గతంలో నీళ్ళు వేడి చేసుకోవడానికి రాగితో చేసిన



బాయిలర్లు వాడే వాళ్ళు. ఇందులో వేడి చేసిన నీరు వాడడం వల్ల చర్మ సంబంధిత రోగాలు కూడా తగ్గేవని రుజువు చెయ్యబడ్డాయి.

రాగి చెంబులో రాత్రి నీరు వుంచి పగలు నిద్ర లేవగానే తాగితే చాలా చాలా మంచిది. అలా తాగితే కడు పులో వున్న చెడు అంతా మూత్రం ద్వారా బయటకి వచ్చేస్తుందట. ఈ అలవాటు వల్ల గ్యాస్, కిడ్నీ, లివర్ సమస్యలు కూడా తగ్గిపోతాయి.

బ్రిటిష్‌కి చెందిన ఒక యూనివర్సిటీ వాళ్ళు కూడా రాగిపాత్రలలో ఉంచిన నీటిపై పరిశోధన జరిపి పైన పేర్కొన్న విషయాలు నిజమని నిరూపించారు.

**పరగడుపున రాగి పాత్రలో నీళ్లు:**


రాత్రి రాగి చెంబులో మంచి నీళ్ళు వుంచి పరగడుపున తాగితే హాయిగా జీవించవచ్చు. రాత్రి నిద్ర పోయేముందు అర లీటర్ నుండి లీటర్ ఉండే రాగి చెంబు నిండా మంచినీళ్ళు పోసి మంచం పక్కనే పెట్టుకోవాలి ఉదయం నిద్ర లేచి లేవగానే రెండు సార్లు పుక్కిలించి ఊసి ఆ రాగి చెంబులోని నీళ్లు తాగాలి . దీనివల్ల 15 నిమిషాల నుండి అర గంటలోపు సుఖ విరోచనం అవుతుంది. గ్యాస్, కడుపుబ్బరము, కడుపులో మంట, మలబద్ధకం, తేపులు, మొదలైన బాధలన్నీ ఈ అలవాటుతో ఎటువంటి ఔషదాలు వాడే పని లేకుండా పూర్తిగా తగ్గిపోతాయి. మలబద్ధకం అనేది అన్ని వ్యాధుల్ని కలిగించడానికి మూలకారణం కాబట్టి ఈ అలవాటు తో మలబద్ధకం నివారించుకుంటే హాయిగా జీవించవచ్చు.

**ఘనమైన రాగి చరిత్ర:**

ఇక రాగి చెంబులో నీళ్ళే ఎందుకు తాగాలి వేరేవి ఉన్నాయి కదా అని కొందరికి సందేహం రావచ్చు . రాగి గురించి వరాహ పురాణంలో వివరంగా ఉంది ఈ రాగి ఏడువేల యుగాల క్రితమే విష్ణు మాయ కారణంగా పుట్టింది .

# యోగాతో అనునిత్యం ఆరోగ్యం

తరుచుగా అనారోగ్యాలకు గురయ్యే మహిళలు నిత్యం యోగా చేయడం మూలంగా అరోగ్యం కుదుటపడుతుందని వైద్యులు సూచిస్తున్నారు. వివిధ రకాల యోగాసనాల మూలంగా శరీరం, వమనసు రెండు కూడా ప్రశాంతంగా ఉంటాయని వారంటున్నారు. మానసిక ఒత్తిడిని అధిగమించడానికి యోగా ఎంతోగానో ఉపయోగపడుతుందని, మహిళలు ఇంటి పట్టునే ఉండి ప్రతిరోజు ఈ యోగాను చేయడం మూలంగా అన్ని రకాల సమస్యలు పరిష్కారమవుతాయని వారంటున్నారు. యోగాలో భాగంగా ప్రాణాయామం గురించి ఈ వారం తెలుసుకుందాం.



ప్రాణం + ఆయామం = ప్రాణాయామం. ప్రాణమంటే జీవన శక్తి. ఆయామం అంటే విస్తరింపచేయుట లేక నియంత్రించి ఉంచుట అని అర్థం. పతంజలి మహర్షి ప్రసాదించిన యోగ సూత్ర ప్రకారం శ్వాస, ప్రశ్వాసల్ని నియంత్రించి ఉంచడమే ప్రాణాయామం అని నిర్ధారించడం జరిగింది. లోనికి పీల్చే గాలిని శ్వాస అని, బయటికి వదిలే గాలిని ప్రశ్వాస అని అంటారు. శ్వాస ప్రశ్వాసల్ని నియంత్రించడం, క్రమబద్ధం చేయడం ద్వారా అంతర్గత సూక్ష్మప్రాణాన్ని కూడా అదుపులో ఉంచవచ్చు.

**నియమబద్ధంగా**

నాడీమండలం, రక్త ప్రసార ధమనులు, జీర్ణకోశం, మూత్రకోశం మొదలుగా గల వాటన్నిటి యందు ప్రాణం సంచరిస్తూ ఉంటుంది. ప్రాణాయామం వల్ల వాటన్నింటికి శక్తి, రక్షణ కల్పిస్తాయి. కనుకనే ప్రాణాయామేన యుక్తేన సర్వరోగ క్షయ భవేత్'' అంటే ప్రాణాయామం నియమబద్ధంగా ఆచరిస్తే సర్వరోగాలు హరించిపోతాయి అను సూత్రం ప్రచలితం అయింది. ప్రాణానికి ప్రాణ, అపాన, సమాన, ఉదాన, వ్యానమను 5 రూపాలు ఉన్నాయి. ప్రాణానికి స్థానం హృద యం. అపానానికి స్థానం గుదం. సమానానికి స్థానం నాభి. ఉదనానికి స్థానం కంఠం. వ్యానానికి స్థానం శరీరమంతా. శ్వాసక్రియకు ప్రాణం, విసర్జన క్రియకు అపానం, పాచన క్రియకు సమానం, కంఠశక్తికి ఉదానం, రక్తప్రసార క్రియకు వ్యానం తోడ్పడుతాయి.

**రేచకం-పూరకం**

శ్వాసను బయటకు వదిలే క్రియను రేచకం అని, లోపలకి పీల్చే క్రియను పూరకం అని, లోపల గాలిని ఉంచడాన్ని అంతర్ పూరకం అని, తిరిగి బయ టకి వదిలి ఆపి ఉంచడాన్ని బాహ్యాకుంభకం అని అంటారు. ఈ క్రియలు ప్రాణాయామానికి సాధనాలు. మెడికల్ సైన్స్ ప్రకారం రెండు ముక్కు రంధ్రాల ప్రయోజనం ఒక్కటే. కాని యోగులు ఈ రెండింటికి మధ్య గల భేదం గ్రహించారు. వారి పరిశోధన ప్రకారం కుడి ముక్కు రంధ్రాన్నుంచి నడిచే గాలి కొద్దిగా ఉష్ణం కలిగిస్తుంది. అందువల్ల దీన్ని వారు సూర్య నాడి లేక సూర్య స్వరం అని అన్నారు. అట్లే ఎడమ ముక్కు రంధ్రం ప్రభావం వల్ల చల్లని దనం అందువల్ల దాన్ని చంద్రనాడి లేక చంద్రస్వరం అని అన్నారు. ఈ రెండిటికి మధ్య సమన్వయం సాదించుటకు యోగ శాస్త్రంలో ప్రాధాన్యం ఇవ్వబడింది. హ అను అక్షరం చంద్రుడికి, ఠ అను అక్షరం సూర్యు డికి గుర్తుగా నిర్ధారించారు. అందువల్ల హఠ యోగం వెలువడింది. హఠ యోగ మంటే చంద్ర సూర్య నాడులకు సంబంధించిన విజ్ఞానం అన్నమాట. హఠం అనగాబలవంతం అనికాదు. ప్రాణాయామ విజ్ఞానమంతా చంద్ర, సూర్య స్వరాలకు సంబంధించినదే.


**ప్రాణాయామం వల్ల కలిగే ప్రయోజనాలు...**

1. ఊపిరితిత్తులు బాగా పనిచేస్తాయి.
2. శరీరానికి ప్రాణవాయువు బాగా లభిస్తుంది.
3 . రక్త శుద్ధి జరిగి అందలి చెడు అంతా బయటికి వెళ్లిపోతుంది.
4 . గుండెకు సత్తువ లభిస్తుంది.
5 . మెదడు చురుగ్గా పనిచేస్తుంది.
6 . ప్రేగులు, నరాలు, నాడులు శుభ్ర పడతాయి.
8 . శరీరం ఆరోగ్యంగా ఉంటుంది.
9 . ఆయుష్షు పెరుగుతుంది. ఇది అన్నిటికంటే మించిన విశేషం.

తీసుకోవలసిన జాగ్రత్తలు

- మైదానంలోగాని, తోటలోగాని, తలుపులు తెరచియున్న గదిలోగాని, కంబళీ లేక బట్ట లేక ఏదేనీ ఆసనం మీద కూర్చొని ప్రాణాయామం చేయాలి.
- గాలి విపరీతంగా వీస్తూ ఉంటే ఆ గాలి మధ్య ప్రాణాయామం చేయకూడదు.- మురికిగా ఉన్న చోట, దుర్వాసన వస్తున్న చోట, పొగ వస్తున్న చోట ప్రాణాయా మం చేయకూడదు.
- సిగరెట్టు, బీడి, చుట్టపొగ వస్తున్న చోట ప్రాణాయామం చేయకూడదు.
- పొట్ట నిండుగా ఉన్నపుడు ప్రాణాయామం చేయకూడదు.
- ప్రాణాయామం చేసే ముందు, చేసిన తరువాత కూడా ఇతర యోగాసనాలు వేయవచ్చు. అయితే చివర శవాసనం వేసి కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవాలి.

# ఈ అవగాహన అత్యవసరమే..!



మీరు మిత్రుడితో కలిసి మాట్లాడుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నారు. అకస్మాత్తుగా అతడు స్పృహ తప్పాడు... ఏం చెయ్యాలి? ఇంట్లో ఒక్కసారిగా తాతయ్య మాటల్లో తడబాటు కనిపించింది... ఎందుకని? ఆ మార్పు ప్రమాదకరమా? రోడ్డు మీద వెళ్తున్నపుడు అకస్మాత్తుగా ఒకరు ఫిట్స్‌తో పడిపోయారు... మనం ఏదైనా సాయం చెయ్యగలమా? ఎప్పుడూ లేనిది కడుపు పై భాగంలో నొప్పి అసిడిటి కావచ్చని అనుకుంటాము... అది నిజంగా అసిడిటినే అయి ఉంటుందా..? లేక మరేదైనా ప్రమాదకరక స్థితి కాదు కదా? ఇలాంటి వన్నీ ఒక్కోసారి అత్యవసర పరిస్థితులకు దారి తియ్యవచ్చు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులను గుర్తించడం.., సమయానికి స్పందించడం... గురించిన వివరాలు

అత్యవసర పరిస్థితి చెప్పి రాదు; అది ఎప్పుడైనా ఎదురు కావచ్చు. ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఎవరికైనా ఏర్పడనూ వచ్చు. అలాంటి స్థితిని ఎదుర్కోవడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలి. అది మనతో ఉన్న వారు అకస్మాత్తుగా స్పృహ తప్పటం, ఎవరికైనా షాక్ కొట్టడం, ఎవరైనా పై నుంచి కింద పడిపోవడం, ఎప్పుడూ లేని విధంగా కడుపులో నొప్పి రావడం, ఇంట్లో ఎవరికైనా స్ట్రోక్ రావడం, రోడ్డు మీద ఎవరికైనా ఫిట్స్ రావడం ఇలా అత్యవసర స్థితి ఎప్పుడైనా ఏరూపంలోనైనా ఎదురు కావచ్చు. అత్యవసర పరిస్థితి ఏర్పడినపుడు ఎలా స్పందించాలనే విషయాల గురించి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి.

**స్పృహ తప్పితే...**

అనుకోకుండా మన వెంట ఉన్న వారు స్పృహ తప్పి పడిపోతే ముందుగా మనకు చాలా కంగారు కలుగుతుంది. ఏం చెయ్యాలో తోచదు. అయ్యో...అయ్యో... అనడం మినహా వెంటనే కర్తవ్యం బోధపడదు. అయితే స్పృహ తప్పిన వారిని ప్రమాదం నుంచి బయట పడెయ్యాలంటే అన్నింటికంటే ముందుగా మనం అలా కంగారు పడకుండా ఉండడం అవసరం. ఒకవేళ కంగారు పడినా వెంటనే సర్దుకోవాలి. పడిపోయిన వారిని గట్టిగా కుదిపి లేపి చూడాలి. గట్టిగా వారి పేరు పెట్టి పిలవాలి. ఒకవేళ వారు స్పందించగలిగితే అది ఒకింత మేలైన స్థితిగా భావించవచ్చు. ఎలాంటి స్పందన లేకపోయినట్టయితే సాయం కోసం ఎవరినైనా అభ్యర్థించడం మంచిది. గొంతు కింద చెయ్యి పెట్టి అక్కడ కొట్టుకునే నాడిని పరీక్షించి చూడాలి. ఇక్కడ కొట్టుకునే నాడిని కెరొటెడ్ పల్స్ అంటారు. అక్కడి నాడీ స్పందన కనిపించకపోతే వెంటనే కార్డియోపల్మనరీ రీ సజిటేషన్(సీపీఆర్) అనే ప్రథమ చికిత్స చెయ్యాలి. ఇందులో భాగంగా ఒకచేతి మీద మరో చేతిని ఉంచి బాధితుడి ఛాతి మధ్య భాగంలో బలంగా ఒత్తిడి కలిగించాలి. ఈ ఒత్తిడి ఎంత బలంగా ఉండాలంటే లోపలికి ఛాతిని ఒత్తినపుడు అది దాదాపు రెండు అంగుళాల మేర లోపలికి వెళ్లాలి. అలా 30 సార్లు ఒత్తిడి కలిగించిన తర్వాత బాధితుడి ముక్కు మూసేసి నోటిని నోటితో మూసేసి బలంగా రెండు సార్లు ఊపిరి తిత్తులలలోకి గాలి ఊదాలి. ఇలా వంద సార్ల వరకు ఒత్తిడి కలిగించాలి. గాలి ఊదాలి. ఇది 30:2 నిష్పత్తిలో ఉండాలి. అంటే 30 సార్లు ఒత్తిడి కలిగించి 2 సార్లు గాలి ఊదాలి. ఇలా 5 నిమిషాలు చేసి తిరిగి సీపీఆర్ కొనసాగించాలి. నాడి తిరిగి కొట్టుకోవడం మొదలు పెట్టే వరకు ఈ చికిత్స కొనసాగించాలి.

ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫ్యూజర్ ఉపయోగిం చవచ్చు. ఇది ఆ సమయంలో షాక్ అవసరమా కాదా అనేది కూడా నిర్ణయిస్తుంది. దీనిలో మూడు బటన్స్ ఉంటాయి. మొదటిది ప్యాడ్స్‌ను బాధితులకు అమర్చడానికి, రెండోది హృదయస్పందనను విశ్లేషించడానికి, మూడోది షాక్ అవసరమా కాదా నిర్ణయించడానికి ఉపయోగపడతాయి. దీనిని ఎవరైనా ఉపయోగించవచ్చు. నిజానికి ఇది అన్ని పబ్లిక్ ప్లేస్‌లలో అందుబాటులో ఉండాలి. **మూర్ఛ** మూర్ఛతో బాధపడేవారిని చూసినపుడు చాలా భయం కలుగుతుంది. ఎలా స్పందించాలో కూడా అర్థం కాదు. అందరూ ఒకరకమైన ఆందోళనతో చుట్టూ చేరతారు. కొంత మంది కాస్త ధైర్యం చేసి వారి చేతికి ఏ ఇనుప వస్తువునో, తాళం చేతుల గుత్తినో అందించేందుకు ప్రయత్నం చేస్తారు. అయితే దీనితో పెద్దగా ప్రయోజనం లేదనేది నిపుణుల మాట. ఎవరికైనా మూర్ఛ వచ్చినపుడు కొన్ని ప్రత్యేకమైన జాగ్రత్తలు పాటించడం వల్ల రోగికి కొంత ఉపశమనం కలిగించిన వారిమవుతాము.

-మూర్ఛ వచ్చిన వారి చుట్టూ గుంపు కట్ట కూడదు.

-వారిని ఒడిసి పట్టుకునే ప్రయత్నం కూడా చెయ్యొద్దు, దగ్గరలో ఏవైనా గాయపరిచే వస్తువులు ఉంటే వాటిని దూరంగా తీసేస్తే చాలు

-మూర్ఛ నుంచి బయటపడిన వెంటనే తినడానికి ఏమీ ఇవ్వ కూడదు -ఒక వైపుగా తిప్పి పడుకోబెట్టడం వల్ల మూర్ఛ సమయంలో వారి నోట్లోకి వచ్చిన లాలాజలం వంటి స్రావాలు ఊపిరితిత్తుల్లో చేరకుండా నివారించవచ్చు. అది ఎడమ వైపు తిప్పి పడుకోబెడితే మరీ మంచిది.

# టెన్షన్ జయించాలంటే ..



ఈ రోజుల్లో పసివాడు మొదలుకొనిపండుముసలి వరకు అందరూ ప్రతిదినం అనేకమార్లు వల్లించే మాట ఇది. ప్రతి దానికీ ఏదో తెలియనిఆందోళన. ఫలితంగా యవ్వన దశలోనేవివిధశారీరక,మానసికరుగ్మతలు.ఆధునిక జీవన విధానంలో సంక్లిష్టత వల్ల ఏర్పడుతున్న దు:స్థితి ఇది. ఒకవైపు సాంకేతిక వైజ్ఞానిక ప్రగతి, నవ నాగరికత వల్ల ఏర్పాటౌతున్న సుఖభోగాల...ఎన్నిఉన్నాఉద్విగ్నం, బెంగ, దిగులుకొత్త కొత్త తరహాల్లోఎదురౌతున్నాయివీటికి కారణాలేమిటి? పరిష్కారమేమిటి?.. మానసిక స్థైర్యం కొరవడటమే ఈ పరిస్థికి కారణం. నిజానికి దీనికి పరిష్కారం- పూర్తిగా ఆధారపడదగినది - మన పూర్వీకులే మనకు ఇచ్చారు. బాల్యం నుండే పెంచి పోషించుకుంటున్న పోటీ ప్రవృత్తిని ఒకరిని మించి పోవాలనే తాపత్రయం, అన్నిభోగసాధన లు తమకుఅందుబాటులో ఉండాలం ే లాలస... ఈ విధమైన దృక్పథాలవలన అశాంతికి లోనౌతున్నాడు నవీన మానవుడు. ఆధ్యాత్మిక ధార్మిక ఆలోచనారవళినిపెంపొందించు కోవడమే దీనికి పరిష్కారం. ఎటువంటి పరిస్థితి ఎదురైనా వెంటనే ప్రతికూలం (Negative) గా స్పందించకుండా, ప్రశాంతతని కోల్పోకుండా మసలగలిగే అనుకూల (Positive) ధోరణిని అభ్యాసం చేయాలి.

ఎవరు ఆదర్శం?ఈ మానవలోకానికి 'మిశ్ర' లోకం అని పేరు. సుఖదు:ఖ మిశ్రణమే ఇహలోక వైఖరి. ఈ అనుభవాలకి ఎలా స్పందించాలి?

**దు:ఖేష్వనుద్విగ్నమనా: సుఖేషు విగత స్పృహ:।**
**వీతరాగ భయక్రోధ: స్థిత నీర్మునిరుచ్యతే ॥**

"దు:ఖంలో మనస్సు ఉద్విగ్నం చెందకుండా, సుఖాలలో అంటుకొని పొంగిపోకుండా, మోహం, క్రోధం, భయం వంటి వికారాలకు లోనుకాకుండా ఉండేవాడే స్థితప్రజ్ఞుడు'' అని గీతాచార్యుని మాట జ్ఞాని మన:స్థితి 'సంయమనం' 'సమతుల్యం'గా ఉంటుంది. అలాంటి యోగిని మనం ఆదర్శంగా తీసుకొని పురోగమించిడం సుఖజీవన మార్గం. కానీ మనం అధిక సంపన్నుల్నీ, కీర్తిమంతుల్నీ మనకు 'మోడల్స్' గా ఎంచుకుంటాంగానీ, గొప్ప వ్యక్తిత్వాలను ఆదర్శాలుగా భావించం.పైగా మానసిక దృఢత్వమనేది ఏదో ఆధ్యాత్మిక వాదంగా పరిగణిస్తాం గానీ మానవుని వికాస వ్యక్తిత్వంగా లెక్కించం. ఆందోళన ముందువెనుకల్ని ఆలోచించనీయదు. కార్యశీలతకు భంగకరం కూడా. దూరాన వస్తున్న రామలక్ష్మణుల్ని మొదటి సారిగా చూసిన సుగ్రీవుడు విపరీతమైన టెన్షన్‌కి (ఉద్విగ్నానికి) లోనై, అటూ ఇటూ పచార్లు చేస్తుండగా, హనుమంతుడు గమనించి-'' నువ్వు ప్రశాంతతని కోల్పోతే ఏపనీ చేయలేవు. వారిద్దర్నీ చూసి, 'వాలి నీ పైకి పంపిన బలవంతులైన యోధులు' అని నిర్ణయించుకొని భయపడుతున్నావు. కానీ అది రూఢి కాలేదు. ఏమీ తేలకుండానే ఉద్విగ్నపడే మనస్తత్వమున్న వాడు కార్యదక్షుడు కాలేడు'' అని మందలించి, తాను స్వయంగా వెళ్ళి, రామలక్ష్మణుల సమాచారం గ్రహించాడు. వారిని సుగ్రీవునికి మిత్రులుగా చేసి మహోపకారం చేశాడు. కేవలం కథా దృష్టితో చూస్తే -మారీచుడు మాయాజాలంతో రాముని కంఠస్వరాన్ని అనుకరిస్తూ అరచిన ధ్వనికి - వేగిరపడిని సీతమ్మ ఆందోళనే మాటల్లో వర్ణించలేనంత టెన్షన్‌కి గురయింది. ఆ టెన్షనే చికరికి ఆమె అపహరణం వరకు దారితీసింది. భయచకితమైన మానసిక స్థితిలో తీసుకొనే నిర్ణయాలు ప్రమాదాలకి దారితీస్తాయి.

జరగవలసింది జరగకమానదు - అనే ధోరణి ఒక విధంగా మనశ్శాంతినీ, ఊరటనీ ఇస్తుందనేది వాస్తవమే. కానీ ఈ ధోరణి మన ప్రయత్నాన్ని కుంటుపరచదా? అని కొందరి సందేహం. ఏ సిద్ధాంతాన్నైనా ఎలా, ఎంతవరకు స్వీకరించాలి? అనేది మనయుక్తిపై ఆధారపడి ఉంటుంది భారతీయుల కర్మ సిద్ధాంతాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటే చక్కని మన:స్థితిని ఏర్పడుతుంది. కర్మకు తగ్గ ఫలితం అనుభవించక తప్పదు. మన ప్రయత్నం మనం చేసినా తొలగించలేని దానినే ప్రారబ్ధం అంటాం. పురుష ప్రయత్నం తో చేసినదే కదా! ఇది వరకటి కర్మలఫలానికే 'అదృష్టం' 'దైవం' 'భాగ్యం' అని పేరు. ప్రపంచంలో అందరూ ఒకేలా ఉండరు. ఎవరి 'అదృష్టం' వారిది. అలాగని ప్రయత్నం మానం. ప్రయత్నానికి 'పౌరుషం' అని పేరు. మన ప్రయత్నం దృఢంగా, ఏకాగ్రంగా, పట్టుదలగా ఉంటే అదృష్టాన్ని కూడా మార్చవచ్చు అని శాస్త్రం. 'అదృష్టం ఇంతే' అని సరిపెట్టుకునే స్థితి మనసుకి శాంతినిస్తుంది. పట్టుదలగా కృషి చేసేవాడూ ఆందోళనని ప్రక్కకి పెడతాడు.రెండింటికీ చెందని బలహీనుడే అశాంతి పాలవుతాడు. మన కృషికి తగినదీ, మన అవసరాలను తీర్చేదీ అయిన సంపాదనతో తృప్తిపడడం నేర్చుకోవాలి. పోటీ, ఆందోళన లేకుండా ధర్మబద్ధంగా ప్రయత్నించడానికి సాధన చేయాలి. కొందరు ఎల్లప్పుడూ తామున్న ఉద్యోగం, స్థితి విషయంలో అసంతృప్తి గానే గడుపుతుంటారు. 'గతిలేక అందులో ఉన్నాం' అనే భావన లో ఉంటారు. ఇది కూడా ఒక విధమైన మానసిక రుగ్మతయే. 'ఎవరెక్కడవుండాలో అక్కడేసరిగ్గాఉంచబడ్డారు' (Everyone is rightly placed) అనే ఆంగ్లనానుడి కర్మ సిద్ధాంతానికి దగ్గరిదే.

# నూతన డివిజనల్ పి.ఆర్.ఓ.గా బాధ్యతలు స్వీకరించిన నారాయణరావు



విశాఖపట్టణం (విజయభాను న్యూస్) : సమాచార పౌర సంబంధాల శాఖ విశాఖపట్నం కార్యాలయంలో నూతన డివిజనల్ పి.ఆర్.ఓ.గా డి. నారాయణరావు సోమవారం భాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంత వరకు విజయ నగరంలో ఏపీఆర్వోగా పని చేసి పదోన్నతిపై జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జునను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నారాయణరావును సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ వి.మణిరామ్ అభినందించారు. ఇతర అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆడుదాం - ఆంధ్ర శాంపిల్ కిట్లను పరిశీలించిన కలెక్టర్



విశాఖపట్టణం (విజయభాను న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వచ్చే నెలలో నిర్వహించబోతున్న ఆడుదాం - ఆంధ్ర కార్యక్రమం నేపథ్యంలో జిల్లాకు అందిన ఆడుదాం - ఆంధ్ర క్రీడలకు చెందిన స్పోర్ట్స్ కిట్ల శాంపిల్ ను కలెక్టర్ డా ఏ మల్లికార్జున విశాఖపట్నం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో సోమవారం పరిశీలించి సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలని అన్నారు. సెట్విస్ సిఈఓ ఎస్ వెంకటేశ్వర్లు వివరిస్తూ జిల్లాలోని అన్ని సచివాలయాలకు ఈ కిట్లు పంపబడుతాయని తెలిపారు. ఆడుదాం - ఆంధ్ర క్రీడల రాష్ట్ర స్థాయి పోటీలు విశాఖపట్నం లో నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్డిఓ శ్రీమతి జూన్ గ్యాలియెట్ తదితరులు పాల్గొన్నారు.

# సి.ఎం. నగర పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జివిఎంసి కమిషనర్



విశాఖపట్నం అక్టోబర్ 09:- రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అక్టోబర్ 16 తేదీన విశాఖ నగరంలో ఇన్ఫోసిస్ ఐటీ కంపెనీ ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న సందర్భంగా ఆయా ఏర్పాట్లను పూర్తి చేయాలని జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ జివిఎంసి అధికారులను, ఆదేశించారు. సోమవారం ఆయన ఋషికొండ ఐటి సెజ్ ప్రాంతాలలో జీవీఎంసీ అధికారులు, ఇన్ఫోసిస్ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఇన్ఫోసిస్ కార్యాలయం తో పాటు ఆయా పరిసర ప్రాంతాలను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఇన్ఫోసిస్ కార్యాలయంలో ముఖ్యమంత్రి ప్రారంభం చేసే ప్రాంగణం, స్టేజితో పాటు, హెలి ఫ్యాడ్ తదితర ప్రాంతాలను పరిశీలించి ఇన్ఫోసిస్ ప్రతినిధులకు తగు సూచనలు చేశారు. అలాగే రుషికొండ లోని ఇన్ఫోసిస్ పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్యం విద్యుత్తు, రోడ్ల పరిశుభ్రత, రోడ్డు ప్యాచ్ వర్క్ లు, గ్రీనరీ తదితర పనులు త్వరతగతిన చేపట్టాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు.

ఈ పర్యటనలో అదనపు కమీషనర్ డాక్టర్ వై.శ్రీనివాస రావు, ప్రధాన ఇంజనీర్ రవి కృష్ణ రాజు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, జోనల్ కమీషనర్ కె.కనక మహాలక్ష్మి, పర్యవేక్షక ఇంజనీర్ శాంసన్ రాజు, ఎ.ఎమ్.ఓ.హెచ్. డాక్టర్ ఎన్.కిషోర్, కార్యనిర్వాహక ఇంజనీర్ శాంతి రాజు, డిఇ వంశీ తదితరులు పాల్గొన్నారు.

# 15 నుంచి విశాఖ శారదాపీఠంలో దసరా ఉత్సవాలు

- రోజుకో అవతారంలో రాజశ్యామల అమ్మవారి దర్శనం - మహిళలచే నిత్యం కుంకుమార్చనలు

- 20వ తేదీన సామూహిక అక్షరాభ్యాసములు



పెందుర్తి **(విజయభాను న్యూస్) :** శ్రీ శారదా స్వరూప రాజశ్యామలా అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవములు ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. విశాఖ శ్రీ శారదాపీఠంలో ఈమేరకు విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టారు. 24వ తేదీ విజయదశమి వేడుకలతో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి నిత్యం సాయంత్రం మహిళలచే కుంకుమార్చనలు నిర్వహిస్తారు. ఈ పూజల్లో పాల్గొనే వారికి రాజశ్యామల సన్నిధిలో పూజలందుకున్న రాజశ్యామల యంత్రాలను అందజేయనున్నట్లు ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి తెలిపారు. అలాగే 20వ తేదీన మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ పూజ, సామూహిక అక్షరాభ్యాసములు నిర్వహించనున్నామని వివరించారు. అక్షరాభ్యాసాల్లో పాల్గొనే బాల బాలికలకు శారదామాత పాదాల చెంత పూజలందుకున్న పుస్తకాలు, పెన్నులను అందిస్తామని తెలిపారు. ఈ పూజల్లో పాల్గొనదలచిన భక్తులు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఇతర వివరముల కోసం 94403 93333 నెంబరుకు సంప్రదించాలని సూచించారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో ప్రతి రోజూ ఉదయం శ్రీ శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి నిజరూప దర్శనానికి విశేష అభిషేకం ఉంటుందని అన్నారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి చేతులమీదుగా విశేష అభిషేకం జరుగుతుందని తెలిపారు. అలాగే సాయంత్రం శ్రీ శారదా స్వరూప రాజశ్యామల, చంద్రమౌళీశ్వరులకు పీఠార్చన, అనంతరం సాంస్కృతిక ఆరాధన జరుగుతుందని వివరించారు. రాజశ్యామల అమ్మవారు నిత్యం విశేష అవతారాల్లో దర్శనమిస్తారు. తొలిరోజు బాలాత్రిపుర సుందరి, రెండో రోజు మహేశ్వరి, మూడో రోజు వైష్ణవి, నాలుగో రోజు అన్నపూర్ణ, ఐదవ రోజు లలితా త్రిపుర సుందరి. ఆరో రోజు సరస్వతి, ఏడో రోజు మహాలక్ష్మి, 8వ రోజు మహాకాళి, 9వ రోజు మహిషాసుర మర్ధిని, విజయదశమి పర్వదినాన విజయదుర్గా దేవి అవతారాల్లో దర్శనమిస్తారు. తమిళనాడుకు చెందిన అలంకార భట్టర్ల చేతులమీదుగా అమ్మవారి అలంకరణలు ఉంటాయని స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వివరించారు. విజయదశమి పర్వదినాన శమీ వృక్షం వద్ద ఆయుధ పూజ జరుగుతుందని తెలిపారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో అందరూ పాల్గొని రాజశ్యామల అమ్మవారి కృపా కటాక్షములను పొందాలని పిలుపునిచ్చారు

# జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

## జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 282 వినతులు

## జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి, అక్కడ అందే వినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డా. ఎ. మల్లిఖార్జున అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. జిల్లా స్థాయి కార్యక్రమానికి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో, డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే జగనన్నకు చెబుదాంకు అంతే ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. అన్ని స్థాయిల్లో జరిగే కార్యక్రమాలకు జిల్లా స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల నుంచి వచ్చే వినతులకు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీదారు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని, రీ-ఓపెన్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అర్జీకి పరిష్కారం చూపినప్పుడు తప్పకుండా సంబంధిత వ్యక్తి ఫోటో తీసుకోవాలని, ఈ-కేవైసీ కూడా పూర్తి చేయాలని గుర్తు చేశారు. ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రణాళికాయుతంగా నిర్వహించాలి ప్రజల ఆరోగ్య పరమైన సమస్యలను గుర్తించి క్షేత్ర స్థాయిలో వైద్య చికిత్సలు అందించేందుకు ఉద్దేశించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రణాళికాయుతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. వీటి ద్వారా కలిగే ప్రయోజనాలు సంపూర్ణంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి సురక్ష శిబిరాల నిర్వహణలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, మరింత మెరుగ్గా నిర్వహించేందుకు సూచనలు ఏమైనా ఉంటే చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సునిశిత పరిశీలన చేసి సంబంధిత నివేదికను అందజేయాలన్నారు.

అధికారులు సచివాలయాలను సందర్శించాలి అధికారులు వారి పరిధిలో ఉండే సచివాలయాలను తరచూ సందర్శించాలని సచివాలయ ఉద్యోగులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలతో సఖ్యతగా మెలిగేలా, వినయంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సచివాలయ ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. సచివాలయాల్లో ఏమైనా సమస్యలున్నా, సాంకేతిక పరికరాలు కావాలన్నా తనకు నివేదించాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు.

సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 282 విజ్ఞప్తులు అందాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, డీఆర్వో కె. మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ, పోలీసు, ఇతర శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నా

# మర్డర్ కేసులో నాలగవ అదనపు జిల్లా కోర్టు సంచలన తీర్పు

- యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1500 జరిమానా విధించిన న్యాయస్థానం




విశాఖపట్నం క్రైమ్ (విజయభాను న్యూస్): విశాఖపట్నం గౌరవ నాల్గవ అదనపు జడ్జి ఎం. శ్రీహరి ఆనందపురం పోలీసు స్టేషన్ క్రైమ్ . నెంబర్ 109/2012 vide SC No 16/2015 U/S 302, 324, 341 IPC నందు విచారణ ముగిసిన తర్వాత ముద్దాయి బొడ రామునాయుడు కు యావజ్జీవ కారాగార శిక్ష, 1500/- జరిమానా విధిస్తూ తీర్పు ఇవ్వడం జరిగింది. 2012వ సంవత్సరంలో ఆనందపురంలో నివసించే మీసాల సూర్యనారాయణ మరియు మీసాల అప్పలనాయుడు అనే ఇద్దరు వ్యక్తులు బోడ రాము నాయుడు ఇంటి ముందు నుంచి వెళ్తుండగా వారి ఇరువురిని అపి మీరు ఎందుకు ఈ మార్గం గుండా వెళ్తున్నారు అని అడుగుగా ఇది అందరూ వెళ్ళే దారి అందులో తప్పు ఏంటి అని ప్రశ్నించగా వారి మధ్య కొంత వాగ్వాదం జరిగి, నిందితుడు బొడ రామునాయుడు మీసాల అప్పలనాయుడు తల వెనుక భాగం పైన గొడ్డలి తో దాడి చేయడంతో తీవ్ర రక్త స్రావమై స్పృహ తప్పి పడిపోయాడు. మీసాల సూర్యనారాయణ ప్రతిఘటించగా అతని నుదుటి పైన గొడ్డలితో దాడి చేయగా, వెంటనే చుట్టుప్రక్కల వారు 108 అంబులెన్స్ లో కే.జీ.హెచ్ కు తరలించగా మీసాల అప్పలనాయుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆనందపురం పోలీసు స్టేషన్ కు పిర్యాదు చేయగా విచారణ అనంతరం సదరు వ్యక్తి పాత పగలు వలన హత్య చేసినట్లు రుజువు కావడంతో ముద్దాయి కి గౌరవ కోర్టు వారు పై సంచలన తీర్పు విధించడం జరిగినది. పై కేసు నందు కన్విక్షన్ పడుట లో ప్రతిభ కనబరిచిన పీ.పీ బర్కత్ అలీ ఖాన్ ని, కేసు ట్రయిల్ జరడంలో పురోగతి చూపించిన నగర పోలీసు అధికారులను, పీసీ 2920 ఏ. ప్రతాప్ బాబు నీ నగర పోలీసు కమిషనర్ డాక్టర్.ఏ.రవి శంకర్, (ఐ.పి.ఎస్) అభినందించడం జరిగింది , కోర్టు ట్రైల్స్ నందు విశేష సేవలు అందించినందుకు గాను అభినంధించి,ఏపీ డి.జి.పి అదేశాలను అనుసరించి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న ప్రయారిటీ కేసుల నందు కోర్టులో ట్రయిల్ కు వచ్చి కన్విక్షన్ పడేంత వరకూ ఉన్నతాధికారులు ప్రతీ కేసును కన్విక్షన్ పడే వరకూ పూర్తి మోనటరింగ్ చేయాలని, ప్రతీ ఉన్నతాధికారి 5 కేసులు మోనటరింగ్ చేసే విధముగా అదేశాలు ఇచ్చామనీ ,కేసుల విషయం లో క్రమం తప్పకుండా స్టేషన్ ఇన్స్పెక్టర్ల తో మాట్లాడుతూ ఉండాలని, ఎక్కువ కేసులు గల రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీటర్స్ పై నిరంతరం దృష్టి పెట్టాలని తెలిపారు, ప్రతీ నెలా కన్విక్షన్ పడుతున్న కేసుల సంఖ్య మునుపటి నెలతో పోల్చినప్పుడు పెరుగుదల కనిపించాలని తెలిపారు.

# వర్చ్యువల్ రియాలిటీ పై గీతంలో వర్క్ షాప్



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులలో వర్చ్యువల్ రియాలిటీ ఒకటి అని విద్యార్థులు విఆర్ పై అవగాహన పెంచుకుని అవకాశాలను విస్తృతం చేసుకోవాలని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ విభాగం అధిపతి ప్రొఫెసర్ జె.బి.సెవెన్త్ లైన్ పేర్కొన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీర్స్( ఐ.ఇ.టి.ఇ) గీతం విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన వర్చ్యువల్ రియాలిటీ పై వర్క్ షాప్ ను ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు. వర్చ్యువల్ రియాలిటీ ప్రయ్జోజనాలు వివరించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రఫెసర్ డాక్టర్ ఎమ్.క్రాంతి కిరణ్ విద్యారంగంలో వర్చ్యువల్ రియాలిటీ వల్ల ఉపయ్జోగాలను, నూతన అధ్యయన విశేషాలను తెలియజేశారు. గూగుల్ కార్డ్బ బోర్డ్, యూనిటీ సాఫ్ట్ వేర్ ల ద్వారా వర్చ్యువల్ రియాలిటీ పై అవగాన ఎలా పెంచుకోవచ్చునో వివరించారు.కార్యక్రమంలో ఐ.ఇ.టి.ఇ ఫ్యాకల్టీ సలహదారు డాక్టర్ పి.రాజు, కోఆర్డినేటర్లు డాక్టర్ ఎస్.శారద, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com